ప్రజాశక్తి
మంగళవారం డిసెంబర్ 30 2025 పేజీలు 12

విజయనగరం

పార్వతీపురం మన్యం

అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వం

- వారి వారసత్వాన్ని కొనసాగిస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- అమరవీరుల చరిత్ర పుస్తకం ఆవిష్కరణ

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వబోమని, వారి వారసత్వాన్ని కొనసాగిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు రాసిన జిల్లా అమరవీరుల చరిత్ర పుస్తకాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం వామపక్ష పార్టీల నాయకులతో కలిసి వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ చరిత్రను అర్థం చేసుకుంటూనే భవిష్యత్‌ను రూపొందించుకోవాలన్నారు. ప్రజలు కోసం నిస్వార్థంగా భూమి కోసం, భుక్తి కోసం పోరాటాలు చేసిన కమ్యూనిస్టులు, కవులు, కళాకారుల గురించి రాయడం అభినందనీయమని అన్నారు. ఉద్యోగాలను, భూములను, ఆర్భాటంగా బతకడానికి ఉన్న వసతులను విడిచిపెట్టి ప్రజలు కోసం, సమాజ మార్పు కోసం జీవితాంతం ఉద్యమాల కోసం పనిచేసి ఉన్నారన్నారు. అటువంటి వారి పోరాటాలు, త్యాగాలు వృథా కాకుండా కొనసాగిస్తామన్నారు. సామాజిక న్యాయం కోసం,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న ది కమ్యూనిస్టులేన్నారు. పేదలకు భూములు పంచాలని కోరుతూ పోరాటం చేస్తుంటే నేడు ప్రభుత్వాలు కార్పొరేట్ దోపిడీదారులకు భూములు అప్పగించే పనిలో పాలన సాగుతోందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని అన్ని జిల్లాల్లో రైతుల నుంచి భూములు సేకరించి ఒక్క పరిశ్రమ కూడా పెట్టడం లేదన్నారు. అటువంటి భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న అనకాపల్లి జిల్లా సిపిఎం నాయకుడి పై పీడీ చట్టం కింద నమోదు చేశారంటే కమ్యూనిస్టులు అంటే పాలకులకు ఎంత భయమో ఉందో అర్థమవుతుందన్నారు. కమ్యూనిస్టులు అభివృద్ధికి వ్యతిరేకమని చెబుతున్న పాలకులు రాష్ట్రం అభివృద్ధికి ఎక్కడెక్కడ ప్రాజెక్టులు కట్టాలో చెప్పింది కమ్యూనిస్టులని తెలుసుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి కోసం భూ పంపిణీ జరగాలని మనం కోరుతుంటే అభివృద్ధి పేరుతో లక్షల ఎకరాలు కార్పోరేట్ శక్తులకు ఇవ్వడం సరికాదన్నారు. నేడు దేశంలో ఉన్మాద పాలన సాగుతుందని, ప్రజా ఉద్యమాలు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో అమరవీరుల స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

పుస్తక రచయిత రెడ్డి శంకరరావు మాట్లాడుతూ నేడు చరిత్ర యువతకు, ప్రజలకు తెలిజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పుస్తకం పోరాడే శక్తులకు ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అమర వీరుల చరిత్ర ప్రస్తుత తరానికి తెలియడం ద్వారా సమాజంలో మంచి మార్పును తీసుకువచ్చేందుకు తోడ్పడుతుంది. ఈ పుస్తకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అమరవీరుల స్ఫూర్తితో జిల్లాలో పేదల పక్షాన ఐక్య ఉద్యమాలకు సన్నద్ధం కావాలి.

- సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

కార్యక్రమంలో పలువురు వామపక్షాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోరాటాల చరిత్ర కలిగినది విజయనగరం జిల్లా. పోరాడే శక్తులకు ఈ పుస్తకం తోడుగా ఉంటుంది. పరిశ్రమల్లో హక్కులు కోసం,భూమి కోసం, భుక్తి కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర మనది. రానున్న కాలంలో సమ సమాజం కోసం చేపట్టే పోరాటాలకు ఈ పుస్తకం దోహదపడుతుంది.

- సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి బెహరా శంకరరావు

జిల్లాలో అనేకమంది పీడిత ప్రజల కోసం పోరాడిన చరిత్ర మనది. కోరన్న, మంగన్న చరిత్ర మనకు, బావి తరాలకు ఆదర్శం. ప్రస్తుత పాలకులు ఏ ప్రజల కోసం పని చేస్తున్నారో, ఆ ప్రజల జీవితాలను ఏం మార్చారో చెప్పగలరా?. విశాఖ ఉక్కును ఏర్పాటు చేసుకున్న చరిత్ర మన జిల్లా పోరాట యోధులది. వారి త్యాగాలను వృథా కానివ్వకుండా ముందుకు వెళ్తాం.

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

ఉమ్మడి జిల్లాలో జరిగిన గిరిజన పోరాటాలు ,రైతాంగ పోరాటాలు స్ఫూర్తిగా నిలుస్తాయి. అటువంటి త్యాగాలు చేసిన పోరాట యోధుల గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది. అమర వీరుల సామాజిక న్యాయం కోసం, గిరిజనుల హక్కుల కోసం, భూమి కోసం ఏ స్ఫూర్తిని అందించారో అదే స్ఫూర్తితో వారి ఆశయ సాధనకు పనిచేయాలి.

- సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

సభకు హాజరైన వామపక్ష నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

విద్యుత్ బిల్లులు చూపిస్తున్న గిరిజనులు

గిరిజనుల గుండెల్లో విద్యుత్ గు'బిల్లు'

- ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్
- వేలకొద్దీ బిల్లులు రావడంతో ఆందోళన
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ పథకాన్ని గత కొంతకాలంగా ప్రభుత్వం అమలు చేస్తోంది. అయితే విద్యుత్ సిబ్బంది బిల్లింగ్ లోపమో, నిరుపేద గిరిజనులు అధికంగా విద్యుత్ వినియోగిస్తున్నారో తెలియదు కానీ కొమరాడ మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో గిరిజనులకు వేలాది రూపాయల బిల్లులు చెల్లించాలంటూ నోటీసులు అందాయి. ఒక్కో గిరిజన కుటుంబానికి రూ.5 వేల నుంచి 21 వేల వరకు బిల్లులు కట్టాలంటూ విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో లబోదిబోమంటూ గిరిజనులు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కి హాజరయ్యారు. తమ ఇళ్లల్లో ఒక బల్బు, ఒక ఫ్యాను మాత్రమే వాడుతున్నామని, వేలాది రూపాయల బిల్లులు ఎలా వచ్చాయని వారు ప్రశ్నిస్తున్నారు. కొమరాడ (మిగతా..3లో)

చదురుగుడికి పెద్ద పోలమాంబ

ప్రారంభమైన జాతర తొలిదశ

ప్రజాశక్తి-మక్కువ

రాష్ట్ర గిరిజన పండగగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి జాతర తొలి దశ ప్రారంభమైంది. పెద్ద పోలమాంబ అమ్మవారిని సోమవారం రాత్రి చదురుగుడికి తీసుకువచ్చారు. జనవరి 26, 27, 28వ తేదీల్లో పోలమాంబ అమ్మవారి ప్రధాన జాతర జరగనున్న విషయం విదితమే. ఇందులో భాగంగా తొలుత పెద్ద పోలమాంబను గ్రామంలోకి తీసుకురావడం ఆనవాయితీ. ఈ మేరకు ధర్మకర్తల మండలి చైర్మన్ ఎం.చినతిరుపతి, ఆలయ ఇఒ బి.శ్రీనివాస్ గుడికి చేరుకొని అప్పటికే పూజారి కుటుంబం సిద్ధం చేసిన ఘటానికి (మిగతా..3లో)

ఎస్‌ఐల బదిలీలు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మన్యం జిల్లాలో పలువురు ఎస్‌ఐలకు బదిలీ అయింది. ఈ మేరకు సోమవారం ఎస్‌పి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎం.హేమలత- సీతానగరం, ఎల్.అర్జున్- పాచిపెంట, ఎం.రాజేష్ -పార్వతీపురం రూరల్, పి.దినకర్ - డిఎస్‌బికి, ఎం.జగదీష్ నాయుడు- కొమరాడ, కె.ప్రయోగమూర్తి -పార్వతీపురం టౌన్, డి.వెంకన్న -పాలకొండ, ఎస్.షణ్ముఖరావు- వీరఘట్టం పోలీసుస్టేషన్‌కు బదిలీ కాగా, కె.నీలకంఠం, జి.కళాధర్ విఆర్‌కు అటాచ్ చేశారు.

మాజీ సైనికుడి భూమి కబ్జా

- కలెక్టర్ ఆదేశించినా స్పందించని కింది స్థాయి సిబ్బంది
- ఇప్పించాలని కోరుతూ గ్రీవెన్స్‌లో వృద్ధురాలు ఫిర్యాదు

వినతి అందజేసేందుకు వచ్చిన మాజీ సైనికుడి భార్య సుజనమ్మ

ప్రజాశక్తి-పార్వతీపురం

మండలంలోని లచ్చిరాజుపేట పంచాయతీ, తాళ్ళబురిడి సచివాలయం పరిధిలో ఓ మాజీ సైనికుడికి ప్రభుత్వం ఇచ్చిన ఐదెకరాల భూమిని స్థానికంగా కొంతమంది దర్జాగా కబ్జా చేశారు. 1976లో బాత రూబేన్ అనే మాజీ సైనికుడికి లచ్చిరాజుపేట గ్రామంలో ఐదెకరాల భూమిని (మిగతా..3లో)

గజపతినగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

మహాసభకు మేము సైతం 4లో

న్యూ ఇయర్ వేడుకలపై నిఘా

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని న్యూ ఇయర్ వేడుకలపై నిఘా పెట్టామని ఎస్ఐ ఆర్.గోపాలరావు సోమవారం హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. న్యూ ఇయర్ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అనుమతి లేకుండా పార్టీలు, డీజే కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు నిర్వహించరాదని సూచించారు. ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించి నూతన సంవత్సరాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

కొత్తవలస : ఈ నెల 31 రాత్రి ఎటువంటి అసంఘిక కార్యక్రమాలు చేసినా, మందు పార్టీలు, పేకాట, రేవు పార్టీలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడతామని సిఐ షణ్ముఖరావు హెచ్చరించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు పెట్టి జైలుకు పంపిస్తామన్నారు.

డెంకాడ: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని స్థానిక ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు తెలిపారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో యువత మద్యం తాగి వాహనాలు నడిపితే కొత్త సంవత్సరంతో జైలు పాలవ్వాల్సి ఉంటుందన్నారు. రోడ్డుపై కేకులు కట్ చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించినా కేసు నమోదు చేస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కూడల్లలో వాహనాలు తనిఖీ చేస్తామన్నారు.

గుర్ల: న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నారాయణరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 31రాత్రి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు.

ఒకోచోట కలిసి సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస జిల్లా పరిషత్ హై స్కూల్లో సోమవారం పూర్వ విద్యార్థుల అపూర్వక కలయిక నిర్వహించారు. అందరూ కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించుకొని తాము చదివిన స్కూలుకు ఆర్థికంగా తమ వంతు ప్రయత్నంగా చేయూతనిస్తామని ఒక కమిటీని వేసుకొని స్కూల్లో నేటి విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులపై సమీక్షించుకొని ఒక ప్రణాళిక సిద్ధం చేశారు. పాత మిత్రులు వారి పిల్లలకు ఆర్థికంగా విద్యకు అవసరమయ్యే ఖర్చులు కూడా చేస్తామని పేద విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని తీర్మానించారు. పలువురు పాత స్నేహితులకు ఆర్థికపరమైన ఆరోగ్యపరమైన సమస్యలకు పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి గిరిబాబు అధ్యక్షత వహించారు.

భూ రీసర్వేపై గ్రామసభలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో భూ రీ సర్వేపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. హెచ్‌డిటి, ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో రీ సర్వే ప్రాధాన్యత, భూముల కొలతలు, రికార్డుల సవరణ విధానం తదితర అంశాలపై గ్రామస్థులకు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, పాల్గొన్నారు.

సోంపురంలో సర్పంచ్ ఎం.గంగరాజు ఆధ్వర్యంలో భూ రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర, చిన్నకండేపల్లి గ్రామాలలో సోమవారం భూ రీ సర్వే గ్రామసభలకు సంబంధించి ర్యాలీలు నిర్వహించామని విఆర్ఒ శ్రీను, సర్వేయర్ రఘురాం తెలిపారు. బొడ్డవరలో సర్పంచ్ దేవరపు మీనా అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో జనసేన నాయకుడు వబ్బిన సన్యాసి నాయుడు ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం శాశ్వతంగా భూమి సమస్యల పరిష్కారం కోసం రీసర్వే చేపట్టి రైతులకు తమ భూమి హక్కు పత్రాలు ఉచితంగా అందించడానికే రీ సర్వే ప్రారంభిస్తుందన్నారు. రిసర్వేలో రైతులందరూ పాల్గొని తమ భూములు సర్వే సిబ్బందికి చూపించి, ప్రభుత్వ రికార్డ్సులో తమ భూములు, పేర్లు నమోదు చేయించుకొని ఉచితంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనురాజు, రైతులు పాల్గొన్నారు.

దత్తరాజేరు: గ్రామాల్లో రైతుల భూములు రీసర్వే జనవరి 2 నుంచి ప్రారంభిస్తామని మండల సర్వేయర్ అప్పలస్వామి అన్నారు. సోమవారం ఎస్.బూర్జువలస కె.కొత్తవలస కె.కృష్ణాపురం, మరడాం గ్రామాల్లో భూ రీ సర్వే కోసం రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి సరిహద్దులు వేరొకరి పేరుమీద ఉన్న భూమిని సాగుదారుల పేరుమీద ఎక్కిస్తామని సర్వే చేసేటప్పుడు రైతులు అధికారులకు సహకరించి వారి భూములు సరిచేసుకొని పట్టాదారు టైటిల్ డిడి పాసుబుక్‌లోకి ఎక్కించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, రైతులు పాల్గొన్నారు.

గుర్ల: మండలంలో జరగనున్న భూ రీ సర్వేను రైతులు వినియోగించుకోవాలని సర్వేయర్ శివ అన్నారు. మండలంలోని తాతావారి కిట్టలిలో సోమవారం రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతలో మండలంలో 6 గ్రామాలలో జనవరి 2 నుంచి రీ సర్వే ప్రారంభమవుతోందన్నారు.

ఎస్‌కోట: అవగాహన ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

శాఖల తీరుపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- రేగిడి

రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారని, ఖరీఫ్ వ్యవసాయానికి యూరియా పంపిణీ చేయకపోవడం పట్ల ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావుతో పాటు సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో మండల వ్యవసాయ అధికారి లోకేష్ వ్యవసాయంపై మాట్లాడుతుండగా సభ్యులు అడ్డు తగిలారు. ఖరీఫ్ వ్యవసాయానికి యూరియా రైతులకు అందలేదని, ఇప్పుడు అవసరమైన మొక్కజొన్న పంటలు వేసినా రైతులకు అందకపోవటం బాధాకరమని అన్నారు. మొక్కజొన్న వేసిన రైతులకు గుర్తించి యూరియా పంపిణీ చేయాలని సూచించారు. రెవెన్యూ శాఖ సమీక్షలో సీనియర్ అసిస్టెంట్ మురళి, గిరి హాజరు కాగా గత నాలుగు సమావేశాలకు తహశీల్దార్ హాజరు కాలేదని ఎమ్మెల్సీ తో పాటు వైస్ ఎంపిపిలు సుతిమెత్తగా అంటించారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి హాజరు కాకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. హౌసింగ్ శాఖ ఎఇ ప్రసాద్ సమీక్షలో మాట్లాడుతూ ప్రధానమంత్రి హౌసింగ్‌లో భాగంగా 66 గ్రామాల్లో 2,779 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిపై వైస్ ఎంపిపి టంకాల అచ్చెంనాయుడు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు జాబితాను ఇవ్వాలని ఎఇకి అడుగుగా ఇంకా మంజూరు కాలేదని అన్నారు. ఉపాధి హామీ, విద్య, వైద్యం, ఐసిడిఎస్ శాఖల పనితీరుపై నామ మాత్రం చర్చ జరిగింది. ఆర్ అండ్ బి, ఎక్సైజ్, ఉద్యానవనం, ఆర్‌టిసి ఇతర శాఖలపై అసలు చర్చే లేకుండా చేశారు. గత మూడు మాసాలుగా మండల సమస్యలు పరిష్కరించారా లేదా అనే అంశాలు చర్చకు రాలేదు.

ఈ సర్వసభ్య సమావేశం చర్చించిన సమస్యలపై వచ్చే సర్వసభ్య సమావేశానికి పరిష్కరించే దిశగా పని చేయాలని సభ్యులు కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ శ్యామల కుమారి, సచివాలయ సంయుక్త ఎంపిడిఒ ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చరణ్, ఎంఇఒ వరప్రసాదరావు, ఎపిఒ బాసిన గోవిందరావు, ఎపిఒ హరినాథ్, బూరాడ, రేగిడి వైద్యాధికారులు అసిరి నాయుడు, రీనా చౌదరి, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

మత్తు పదార్థాలకు బానిసలై నేటి యువత వారి భవిష్యత్తులను చిత్తు చేసుకోకూడదని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు కోరారు. సోమవారం స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు వంటి వాటికి యువత దూరంగా ఉండాలని చదువుపైన ఏకాగ్రతను పెంచుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాలలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ చట్టాల పట్ల ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన పెంచుకోవాలన్నారు. నేరాలకు పాల్పడితే భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రహదారి భద్రత, సైబర్ క్రైమ్ వంటి నేరాలు పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి బెట్టింగ్ యాప్‌ల ద్వారా యువత చెడు మార్గం వైపు ప్రయాణం చేయకూడదన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమపై పెట్టుకున్న ఆశలను విద్యార్థులు నెరవేర్చవలసిన బాధ్యత ఉందన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు వాడినా, అమ్మ చూపినా, నిల్వ ఉంచినా నేరస్తులు అవుతారని ఈ సందర్భంగా హెచ్చరించారు. చట్ట పరిధిలో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ జి. శంకరావు, ఎస్ఐ ఎల్.దామోదరావు, మానవీయత స్వచ్ఛంద సంస్థ గోవింద రాజులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి రాఘవులు

జనసేన ఆధ్వర్యంలో క్రీడా పోటీలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరుస్తాయని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. యువత క్రీడలపై దృష్టి సారించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సంక్రాంతి పండుగను గ్రామీణ ప్రాంతాల్లో ఆటపాటలు, ప్రాచీన క్రీడలతో అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా సంక్రాంతి సంబరాలను జరిపేందుకు నిశ్చయించామన్నారు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గ స్థాయిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను పూసపాటిరేగలో నిర్వహిస్తామన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా రామతీర్థంలో ఉత్తర ద్వార దర్శనం, గిరి ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లును అధికారులు చేశారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్న జనసేన నాయకులు కోట్ల రఘు, బాల అప్పలరాజు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పూసపాటిరేగలో నియోజకవర్గ స్థాయి ఎన్‌పిఎల్ (నెల్లిమర్ల ప్రీమియర్ లీగ్) పేరుతో క్రికెట్, వాలీబాల్, రంగవల్లులు, క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 30 నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందని, జనవరి 2 నుంచి 13, వరకు పూసపాటిరేగ హైస్కూల్ గ్రౌండ్, ఎస్ఎమ్ఎస్ మైదానాల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని, మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పోటీలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన సీనియర్ నాయకులు చనుమల్లు వెంకటరమణ, పల్లంట్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- సంతకవిటి

జనవరి 10,11 తేదీలలో గుంటూరులో జరగనున్న యుటిఎఫ్ 51వ రాష్ట్ర కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు బి.శ్రీనివాసం, జిల్లా కౌన్సిల్ సభ్యులు శాసపు బాబురావునాయుడు సోమవారం పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని వారు అన్నారు. అనంతరం యుటిఎఫ్ నూతన సంవత్సర కేలెండర్‌ను సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపిపి ఎన్. గోపమ్మ, మాజీ ఎంపిపి జి.శివ, ఎంఇఒ-2 బి.శ్రీనివాసరావు చేతుల మీదుగా మండల యుటిఎఫ్ పాకెట్ క్యాలెండరు, వాల్ క్యాలెండర్, డైరీలను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. ఈశ్వరరావు, వి.సురేష్ కుమార్, గౌరవ అధ్యక్షులు సి.హెచ్. నిర్మలాదేవి, సహధ్యక్షులు పి. కనకరత్నం, కోశాధికారి పి.సూరప్పారావు, జిల్లా నాయకులు జి.పార్వతి, జి. వెంకటనాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మనల్ని ఎవర్రా ఆపేది..!?

- అక్రమంగా ఇసుక గ్రావెల్ తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

అక్రమార్కులకు అడ్డాగా మారిన కంకర మెట్ట

ప్రజాశక్తి-మక్కువ

ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా, రాత్రీ పగలూ తేడా లేకుండా మనల్ని ఎవరు ఆపేది..?! అన్న రీతిగా సవాలు విసురుతూ ఇటు గ్రావెల్, అటు ఇసుకను అక్రమార్కులు తరలించుకుపోతున్నారు. మండలంలోని గోముకి, సువర్ణముఖి నదులలో అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగుతుండగా, మరోవైపు గ్రావెల్ తవ్వకాలు కూడా ప్రభుత్వం అనుమతించని ప్రాంతాలలో కూడా బహిరంగంగా జరుగుతున్నాయి ఈ దందాలో వేల రూపాయలు వెనకేసుకుంటూ ముందుకు వెళ్తున్న అక్రమార్కులకు అడ్డు లేకుండా పోతోంది. ప్రభుత్వ నిబంధనలేవి వీరికి వర్తించవన్నట్లు అక్రమ తరలింపులు సాగుతూనే ఉన్నాయి. వీరి అక్రమాలకు మండలంలోని కాశీపట్నం పరిధిలో ఉన్న కంకర కొండ మొత్తం కరిగిపోయిందని చెప్పడంలో కూడా సందేహం లేదు. చెముడు గ్రామ సమీపంలో ఉన్న సువర్ణముఖి నదిలో పెద్ద డంపు ఏర్పాటు చేశారు. ఇక్కడ జెసిబిలతో ఇసుకను తరలిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉచిత ఇసుక ఆసరాగా చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా అటు వంతెన సమీపంలోని అనుమతి లేని ప్రదేశాల్లో కూడా అక్రమ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. మరోవైపు ఇసుక ట్రాక్టర్‌కు రూ.800, గ్రావెల్‌కు రూ.వెయ్యి వసూలు చేసుకుంటూ అక్రమార్కులు కావలసిన వారికి టాక్స్ చెల్లించే సరుకులు మాదిరిగా చేరవేస్తున్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమార్కులకు అటు రాజకీయ నాయకుల అండదండలతోపాటు అనధికారికంగా అధికారుల అండ కూడా ఉందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలించే వారిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వరిచేను కుప్పలు దగ్ధం

రెండు లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తవలస గ్రామ సమీపంలో పంట పొలాల్లో మూడు వరిచేను కుప్పలు దగ్ధమయ్యాయి. ఆదివారం రాత్రి కొత్తవలసకు చెందిన కర్రి బలరాం, తోటవలస గ్రామానికి చెందిన సింగారపు చిన్నారావు అనే రైతులకు సంబంధించిన వరిచేను కుప్పలను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని బాధితులు వాపోతున్నారు. పాచిపెంట, మిర్తివలస, కొత్తవలస గ్రామాలకు చెందిన సుమారు పదిమంది రైతుల వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసి, అందులో ఉన్న రాగిని తీసేందుకు వరి కుప్పల వద్ద నిప్పు పెట్టారని బాధిత రైతులు తెలిపారు. సోమవారం రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రైతులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట సురేష్ కేసు నమోదు చేశారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పి మాధవ్‌రెడ్డి

వివేకంతో వేడుకలు జరపుకోవాలి

విజయనగరంటౌన్ : నూతన సంవత్సరం అనేది కొత్త ఆశయాలు, సానుకూల మార్పులు, మెరుగైన జీవన విధానానికి శ్రీకారం చుట్టే సందర్భమని సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్.వి.ఎస్. సూర్యనారాయణ పేర్కొన్నారు. వేడుకల ఉత్సాహం మితిమీరితే అది ఆనందం కాకుండా ప్రమాదాలకు దారితీయవచ్చని ఆయన హెచ్చరించారు. ప్రతి ఏడాది నూతన సంవత్సరం సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయడం, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రాణాలకు అత్యంత ప్రమాదకరమని అన్నారు. నిజమైన ఆనందం ప్రమాదాల్లో కాకుండా భద్రతలోనే దాగి ఉందని పేర్కొన్న ఆయన, నూతన సంవత్సరాన్ని కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో కలిసి ఇంట్లోనే జరుపుకోవడం ఉత్తమమని సూచించారు.

పశుసంవర్ధక రంగంతోనే

గ్రామీణ ఆర్థిక పురోగతి

పశుపాలనలో సాంకేతికత వినియోగం : కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

పశుసంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను స్థిరపరచవచ్చని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంబంధిత ఇతర శాఖలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధికారులకు, సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులకు సమాచారాన్ని వేగంగా చేరవేయడానికి జెమినీ ఎఐ, పెర్‌ప్లెక్సిటీ ఎఐ వంటి ఆధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పశు పాలనలోని ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని, గ్రామీణ యువతకు స్వయం ఉపాధి దిశగా శిక్షణ ఇవ్వాలని కోరారు. వ్యవసాయ వ్యర్థాలను సంపదగా మార్చే ప్రాజెక్టులు, పశువుల ఎరువు ఆధారిత వ్యాపారాలను ప్రోత్సహించాలన్నారు. ఎగుమతి నాణ్యత కలిగిన మేత ఉత్పత్తిని పెంచి రైతులకు లాభాలు చేకూర్చాలన్నారు. మహిళా డెయిరీ సహకార సంఘాలను బలోపేతం చేస్తూ, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలనే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.ఎస్.ఎన్.రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ, ఇతర శాఖల అధికారులు, పశు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ ప్రశంసలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రెవెన్యూ క్లినిక్ - స్పెషల్ డెస్క్' కార్యక్రమం జిల్లాలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామమూర్తి ఆధ్వర్యాన కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డిని సన్మానించారు. నేడు రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరు ప్రఖ్యాతలు పొందేలా కలెక్టర్ విశేష కృషి చేశారని ఆయన కొనియాడారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి ఎస్.వి.మాధవ్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు ఫిర్యాదులు అందాయి. అర్జీదారులతో ఎస్పి ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి ఎస్ఐ రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎపిఒ చినబాబు

గిరిజనుల గుండెల్లో విద్యుత్ గు'బిల్లు'

(మొదటి పేజీ తరువాయి)

మండలంలోని గుడ్డాం, దేరుపాడు, సంకేషు, వనకాబడి, జీమేషు, కోషు, లొడ్డ, ఉల్లింద్ర గ్రామాలకు చెందిన గిరిజనులకు పెద్ద మొత్తాల్లో విద్యుత్ బిల్లులు అందాయి. తన ఇంట్లో ఒక ఫ్యాన్, ఒక బల్బు వినియోగిస్తున్నామని, కానీ బిల్లు రూ.10 వేలపైనే వచ్చిందని ఊయక అప్పయ్య చెప్పారు. ఈ విధంగా పార్వతీపురం డివిజన్‌లో 11 వేల మంది ఎస్‌సి, ఎస్‌టిలకు నోటీసులు జారీ చేశారు. 200 యూనిట్లు దాటి విద్యుత్ వినియోగించిన ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ పథకం వర్తించదు. అయితే కొంతమంది నిర్దేశించిన పరిమితికి పైబడి విద్యుత్ వినియోగించినా తాము ఎస్‌సి, ఎస్‌టిలమనే ధీమాతో బిల్లులు చెల్లించడం లేదని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టిలు ప్రతినెలా 25 రూపాయల సర్‌ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ సర్‌ఛార్జీ మొత్తాన్ని ఏళ్ల తరబడి చెల్లించక పోయినా వేలాది రూపాయల బిల్లులు వచ్చే అవకాశం ఉంది. డివిజన్ పరిధిలో 11 వేల ఎస్‌సి, ఎస్‌టిల విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి బకాయి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

బిల్లులో లోపాలుంటే సరిచేస్తాం

ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి విద్యుత్ బిల్లుల జారీలో లోపాలుంటే సరి చేసి తగ్గిస్తాం. బిల్లులు తీసే సిబ్బంది తప్పులుంటే సరి చేస్తాం. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ పథకం కింద 200 యూనిట్లలోపు మాత్రమే వినియోగించాలి. దాటితే ఉచిత విద్యుత్ పథకం వర్తించదు. ఉచిత విద్యుత్ వర్తించినా ప్రతినెలా 25 రూపాయల సర్‌ఛార్జీ చెల్లించాలి. ఈ మొత్తాన్ని ప్రతినెలా కొంతమంది చెల్లించకపోవడం, ఏళ్ళతరబడి బకాయి పడడంతో బిల్లు వేలకొద్దీ వచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించి, 25 రూపాయల సర్ ఛార్జీ ప్రతినెలా చెల్లించిన వారికి ఎక్కువ బిల్లు వస్తే సరి చేసి బిల్లు తగ్గేలా చూస్తాం.

- గోపాలరావు నాయుడు, ఇఇ, ఇపిడిసిఎల్, పార్వతీపురం

మాజీ సైనికుడి భూమి కబ్జా

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అందజేసింది. 2019 వరకు మాజీ సైనికుడి కుటుంబం సాగులోనే ఉంది. ఆ తర్వాత కరోనా కారణంగా కుటుంబ సభ్యులు ఆ భూమిని సాగు చేయకుండా వదిలేశారు. అదే అదునుగా భావించిన స్థానిక పెత్తందారీ రైతులు కొంతమంది ఆ భూమిని దర్జాగా కబ్జా చేశారు. సర్వే నెంబర్ 487-1, 480-9, 478-11 లో ఉన్న ఐదెకరాల భూమిని ఆరుగురు ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారుల అండదండలతో ఆక్రమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే గత కొద్ది సంవత్సరాలుగా మాజీ సైనికుడు రూబేన్ భార్య సుజానమ్మ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. 80 ఏళ్ల వృద్ధురాలైన సుజానమ్మ తన కుమారుడు సహకారంతో సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. తన భూమి ఇప్పించాలని కోరారు. సుజానమ్మ కుటుంబం పార్వతీపురం పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న శివిని గ్రామంలో నివశిస్తోంది. ఇంతవరకు అనేక సార్లు ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సమస్యకు జిల్లా అధికారులు పరిష్కారం చూపలేదు. గత వారం ఫిర్యాదు సందర్భంగా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి రైతులు ఆక్రమించిన భూమిని మాజీ సైనికుడి కుటుంబానికి అప్పగించాలని కింది స్థాయి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయినా కిందిస్థాయి అధికారులు భూముల ఆక్రమణ తొలగించే ప్రయత్నం చేయడం లేదు. తమకు ఆ భూమి విక్రయించినట్లు పురోణీ రాశారని ఆక్రమణదారులు బుకాయింపులకు దిగుతున్నారు. పురోణీలు చెల్లవని, హక్కుదారులకు భూమి అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా ఫలితం కనిపించడం లేదు. ఒకవైపు రెవెన్యూ క్లినిక్ పేరుతో వందశాతం భూసమస్యలు పరిష్కరిస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న జిల్లా అధికారులు మాజీ సైనికుడి కుటుంబానికి చెందిన భూమిని అప్పగించడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా ఉంది.

చదురుగుడికి పెద్ద పోలమాంబ

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, మేళతాళాలతో అమ్మవారిని తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు టి.పోలినాయుడు, సర్పంచ్ సింహాచలమమ్మ, ఉపసర్పంచ్ వెంకటరమణ, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్లు దాలినాయుడు, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిజిఆర్ఎస్‌కు 15 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం ఎపిఒ చినబాబు ఆధ్వర్యాన నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 15 వినతులు వచ్చాయి. ట్రాక్టర్, వ్యవసాయ పరికరాల కోసం రుణాలు ఇప్పించాలని పలువురు గిరిజనులు, రైతులు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, పిహెచ్ఒ ఎస్‌వి గణేష్, హెచ్ఒ జయశ్రీ, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, ఎఇ వెంకటేష్, కిరణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జె.గోపాలపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని జె.గోపాలపురంలో సోమవారం వైద్యాధికారి బి.ప్రదీప్.కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ, తదితర రకాలైన రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి.. బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

బొబ్బిలి.. ఆటో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు శంకరరావు

వంగర.. ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

మహాసభకు మేము సైతం

- సిఐటియు ఆధ్వర్యాన బైక్ ర్యాలీలు... సన్నాహక సమావేశాలు
- బహిరంగ సభకు కదులుతున్న వివిధ రంగాల కార్మికులు, స్కీమ్‌వర్కర్లు

గరుగుబిల్లి.. ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు బివి రమణ, ఎండిఎం కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

విశాఖలో ఈనెల 31 నుంచి జరుగనున్న జాతీయ మహాసభలకు మేముసైతం అంటూ అన్ని రంగాల కార్మికులూ కదులుతున్నారు. స్కీం వర్కర్లతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎవరికి వారే సొంత డబ్బులతో బస్సులను ఏర్పాటు చేసుకొని జనవరి 4న జరుగనున్న సిఐటియు బహిరంగ సభకు తరలివెళ్లేందుకు సమాయత్తం అవుతున్నారు.

గరివిడి : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, నాయకులు ఎ.గౌరినాయుడు ఆధ్వర్యాన సోమవారం గరివిడి ప్రాంతంలో డిఎఫ్ఎన్ మైన్స్ వర్కర్స్, ఆక్సైడ్ ప్లాంట్ కార్మికులు, పామాయిల్ కార్మికులు, అంగన్వాడీ వర్కర్లతో సమావేశాలు నిర్వహించారు. డిఎఫ్ఎన్ మైన్స్‌లో కార్మికులతో జరిగిన సమావేశంలో టివి రమణ మాట్లాడారు. మహాసభల ఆవశ్యకతను వివరించారు. 4న జరుగనున్న బహిరంగ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్మికులు వెంకటేష్, అప్పలనాయుడు, సన్యాసినాయుడు, సాంబ, వీరభద్రుడు పాల్గొన్నారు.

బొబ్బిలి : మహాసభ జయప్రదానికి బొబ్బిలి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సిఐటియు నాయకులు పి.శంకర్రావు ఆధ్వర్యాన ఆటో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గంట రాంబాబు, రవి, సిఐటియు నాయకులు మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వంగర : మండలంలోని అరసాడ, మగ్గూరు, సంగాం, వంగర, యం. సీతారాం పురం, మద్దివలస, లక్షింపేట తదితర గ్రామాల్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆటో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా సిఐటియు జిల్లా కార్యదర్శి మరడాన త్రినాధ్ మాట్లాడారు. వై.అప్పలస్వామి భాస్కరరావు, గొడబ అప్పలస్వామి, దుర్గారావు పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : విశాఖలో జరుగు 18వ సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా పూర్వ కార్యదర్శి చల్లా చల్లా జగన్ కోరారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో వేపాడ, లక్కవరపుకోట, కొత్తవలస, ఎస్‌కోట మండలాల్లో ఆటోతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టడమే అఖిలభారత మహాసభల ప్రధాన లక్ష్యమని, ఈ మహాసభలు జయప్రదానికి కార్మిక వర్గం కష్టజీవులు యావత్తు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

అంగన్వాడీలంతా చలో విశాఖ

విజయనగరంటౌన్ : విశాఖ లో జరుగు బహిరంగ సభకు అంగన్వాడీలంతా తరలిరావాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎ. జగన్మోహన్రావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడ్రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఫుల్ బాగ్ లో జరిగిన సెక్టార్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు సునీత, యూనియన్ నాయకులు బొమ్మన పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.జగన్ మోహన్ రావు, ఆటో యూనియన్ నాయకులు బి.పాపారావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విజయనగరం అర్బన్ ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు చిట్టితల్లి, నాయకులు మంగ వేణి, సత్యవతి, జయ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని జాతీయ రహదారి బ్రిడ్జి నుంచి తహశీల్దార్ కార్యాలయం మీదుగా కోనాడ జంక్షన్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో హేచరీ యూనియన్ నాయకులు ఎన్. సూర్యనారాయణ, జి.పెంటరాజు, ఏ.సోమరాజు, పూసపాటిరేగ మండలం గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు ఏ.రాము, ఏ.బంగారం, గురుమూర్తి, మైలాన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: సిఐటియు ఆలిండియా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గజపతినగరం ప్రాజెక్టు పరిధిలోని ఎస్‌ఎల్‌వలస సెక్టార్‌లో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా విభాగాల ప్రతినిధులు మహాసభల ప్రాముఖ్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. ర కార్యక్రమంలో గజపతినగరం ప్రాజెక్టు అధ్యక్షులు ఎం. సుభాషిని, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి మాట్లాడుతూ కార్మికుల, ఉద్యోగుల హక్కుల సాధన కోసం సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తోందని, రాబోయే ఆలిండియా మహాసభలను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి. పైడి రాజు, ఎన్. ఊర్మిళ, రాజేశ్వరి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి బ్రిడ్జి మీదగా పురిటిపెంట సచివాలయం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి ప్రారంభించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పి.కోటి, కనకరాజు, భాస్కర్ రావు, మహంకాళి, కృష్ణ, వంశి, జెరి రాము, సారికి బంగారు నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాకోటి రాములు పాల్గొన్నారు.

పూసపాటిరేగ.. బైక్ ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ, తదితరులు

రేగిడి: సిఐటియు 18వ అఖిల భారత మహాసభల జనవరి 4న హాలో కార్మిక చలో విశాఖ ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని సిఐటియు అధ్యక్షుడు కె.సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం సంకిలి ఈఐడి ప్యారి షుగర్ ఫ్యాక్టరీ వద్ద బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు సందర్భంగా శ్రామిక ఉత్సవ పేరుతో శ్రమను గుర్తించి కళారుపాలు ప్రదర్శన జరుగుతున్నాయని, సినీ ప్రముఖులు హాజరు అవ్వుతున్నారని ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. అనంతరం ఆటోతో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.త్రినాధ్, యూనియన్ అధ్యక్షులు సిమ్మ కృష్ణ, ప్రధాన కార్యదర్శి వి.ఆర్.సి.నాయుడు, కోశాధికారి ఎస్.సురేష్, కటారి వెంకట రమణ, హరి వర్మ, రాము నాయుడు, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల.. కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

దత్తిరాజేరు: మండలంలోని పి.మానాపురం, కెకెవలస అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి ఆధ్వర్యంలో సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 4వ తేదీన విశాఖలో జరుగు ర్యాలీ, బహిరంగ సభకు అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజన కార్మికులు, స్కూల్ ఆయాలు, గ్రీన్ అంబాసిడర్ లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో ర్యాలీ

గరుగుబిల్లి : విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి వి రమణ ఆధ్వర్యాన గరుగుబిల్లిలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.పావని, బి.మణికుమారి, నాయకులు బి.లక్ష్మి, అన్నపూర్ణమ్మ, రోహిణి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ.. ఆటో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు జగన్, కార్మికులు

గరివిడిలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

రాజ్యమేలుతున్న

మనువాదం.. మార్కెట్‌వాదం

- భావ వ్యక్తీకరణపై దాడి
- మానవతా సందేశాలతో జాతీయ స్ఫూర్తికి పునరంకితం కావాలి
- 'శ్రామిక ఉత్సవ్'తో నవ్యాంధ్రకు నవ్య సందేశం విశాఖ నుంచే..
- ప్రముఖ కవి, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'దేశభక్తి వేరు.. ద్వేష భక్తి వేరు. ద్వేషంతో భారతదేశ సంస్కృతి, వారసత్వం నిలబడదు. నేడు 'పబ్లిక్ స్పేస్ (జనం పరిధి) హరించుకుపోయి కార్పొరేట్ స్పేస్ (పెట్టుబడిదారుల పెత్తనం) ఆక్రమిస్తోంది. ప్రతిదీ మానిటైజేషన్, ప్రైవేటైజేషన్ అంటున్నారే తప్ప హ్యూమనైజేషన్ (మానవీయత)కు ప్రాధాన్యమివ్వడం లేదు. మనువాదం.. మార్కెట్‌వాదం నేడు రాజ్యమేలుతున్నాయి. లేబర్ కోడ్‌లు, నిర్బంధ చట్టాలు శ్రమజీవులపై విసిరే కేంద్ర విధానాలపై ప్రజా తిరుగుబాట్లు జరిగితే తప్ప పాలకుల తీరులో మార్పు రాదు' అని ప్రముఖ కవి, రచయిత, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. విశాఖ నగరంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభకు సన్నద్ధంగా ఈ నెల 27 నుంచి తలపెట్టిన 'శ్రామిక్ ఉత్సవ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రవి 'ప్రజాశక్తి' విశాఖ బ్యూరోచీఫ్ ఎన్.మధుతో తన భావాలను పంచుకున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. పిపిపిపి పదాలే తప్ప ఈజ్ ఆఫ్ పీపుల్ లివింగ్.. ఈజ్ ఆఫ్ వర్కింగ్ అనే మాటలు ఎక్కడా కానరావడం లేదంటూ తన రాజకీయ బాణాలను సంధించారు. ఒక్కమాటలో చెప్పాలంటే నవ్యాంధ్రప్రదేశ్‌కు నవ్య సందేశాన్ని విశాఖపట్నం నుంచి ఇచ్చేందుకే 'శ్రామిక ఉత్సవ్' ద్వారా రంగం సిద్ధమైందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ పరిణామాల గురించి వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే...

భావ వ్యక్తీకరణ, మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు.. దాడులు

జాతీయ స్థాయిలో భావన ప్రకటనా స్వేచ్ఛ అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏలిన వారిని పొగిడినంతవరకే మీడియాకు స్వేచ్ఛ తప్ప విమర్శించే హక్కు లేకుండా పోయింది. ఇది కేవలం మీడియాకు మాత్రమే కాదు. సోషల్ మీడియాపైనా, కవిత్వం, సాహిత్యం, రచనలు, అభ్యుదయ సినిమాలపైనా ఈ దాడులు జరుగుతున్నాయి. కొన్ని సినిమాలైతే విడుదల కాకముందే దాడులకు గురౌతున్నాయి. సమాజంలో సగభాగమైనటువంటి మహిళలపై దారుణమైనటువంటి భాషలో విమర్శలు గుప్పించడం చూస్తున్నాం. పత్రికలు సంపాదకీయాలు రాసినా, ప్రధాన రాజకీయ పార్టీలు చెప్పినా.. మేం మాట్లాడిందే సరైనదంటూ మనుషుల పట్ల గౌరవం తగ్గే విధంగా 'మనువాద భావజాలం రాజ్యమేలుతోంది'. మనువాద భావజాలం, మనువాద మార్కెట్ మధ్య ప్రజానీకం, శ్రామికవర్గం, మహిళలు నలిగిపోతున్నటువంటి నేటి పరిస్థితుల్లో మానవతా సందేశం ఇచ్చి మరోసారి జాతీయ స్ఫూర్తికి పునరంకితం కావాల్సి ఉంది. దేశ భక్తి వేరు.. ద్వేష భక్తి వేరు.. ద్వేషంతో దేశం ఎప్పుడూ నిలబడదు. భిన్నమతాలు, భిన్న సంస్కృతులు.. వీటన్నిటికీ నిలయమైన ఈ విశాల భారతదేశంలో మానవతా సందేశాలతో ప్రజలంతా కలసి ముందుకు వెళ్లాలని నాడే గురజాడ, శ్రీశ్రీ పేర్కొన్నారు. ఆ దిశగా అంతా ముందుకు సాగాలి.



విశాఖపట్నం కేంద్ర బిందువు

రాజకీయాల్లో విశాఖపట్నం కేంద్ర బిందువుగా మారింది. తొలి నుంచీ ఉత్తరాంధ్ర సాహిత్య, సాంస్కృతిక పునర్వికాసంలో అగ్రభాగాన నిలబడి ఉంది. తెలుగు భాషను కాపాడటంలో, చైతన్యాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించింది. ప్రకృతి సంపదలకే ఉత్తరాంధ్ర నిలయం. గురజాడ అప్పారావు, శ్రీశ్రీ ఇదే గడ్డపై పుట్టి ప్రజలు, శ్రమ జీవుల తరపున కవిత్వం ఝుళిపించారు. మహాప్రస్థానం ఒక దేశభక్తి సముదాయం. నేడు జనగళం, సాహితీ స్రవంతి వంటి సంస్థలు శ్రామిక ఉత్సవాలను ప్రజా సంస్కృతిని పెంపొందించడానికి చేపడుతున్నాయి. దేశమంటే మనుషులోయ్ అని, సొంతలాభం కొంత మానుకొని పొరుగువాడికి తోడ్పడాలని గురజాడ చెప్పారు తప్ప విశాఖ ఉక్కును, కొండలను, భూములను ప్రైవేట్ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టాలని ప్రభుత్వాలకు ఎవ్వరూ చెప్పలేదు. దేశంలో ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల స్పేస్‌ను కబ్జా చేసే విధానాలు మారడం లేదు. అందుకే ఉద్యమాలను నిలబెట్టే విశాఖ ఉత్సవ్ వంటి కార్యక్రమం ఇక్కడ చేపడుతుండడం గొప్ప విషయం.

ఆకట్టుకుంటూ... ఆలోచింపజేస్తూ

కొనసాగుతున్న సైన్స్ ఎగ్జిబిషన్
అధిక సంఖ్యలో తరలివస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా ఎయు కన్వెన్షన్ హాల్ వెనుకగల ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ సైన్స్‌తోనే మానవ మనుగడ అంటూ ప్రజలను ఆకట్టుకుంటూ, ఆలోచింపజేస్తూ ఆదరణ చూరగొంటోంది. ఈ నెల 27న ప్రారంభించిన ఈ ఎగ్జిబిషన్‌కు ప్రతిరోజూ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున తరలి వచ్చి తిలకిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ అంశాలు వారిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సైన్స్ లేనిదే సమాజం ప్రగతి లేదు. మానవుడు తన చుట్టూ ఉన్న భౌతిక జీవ వాతావరణ నిశితంగా పరిశీలించడం, పరిశీలించిన అంశాల మధ్య అర్థవంతమైన సంబంధాలను ఏర్పరచడం ద్వారా, ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కావాల్సిన భావనలను రూపొందించుకున్నాడు. ఈ మానవ ప్రయత్నమే విజ్ఞాన శాస్త్రానికి దారితీసింది. ప్రకృతిలోని రహస్యాలు తెలుసుకోవడం కోసం ఎందరో శాస్త్రజ్ఞులు నిర్విరామంగా కృషి చేసి మనకు ఈ విజ్ఞాన శాస్త్రాన్ని అందించిన సంగతి తెలిసిందే. సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ, ఆరోగ్య, రవాణా రంగాలన్నింటిలో ప్రతిభావంతమైన మార్పులు శాస్త్రీయ విజ్ఞాన అభివృద్ధి ద్వారా జరుగుతున్నవే. సైన్స్ సాధించిన అనేక విజయాల గురించి చెప్పాలంటే, కంప్యూటర్, పొలిటికల్ సైన్స్, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్‌తో పాటు, అంతరిక్షంలోకి మానవుడు ప్రవేశించే సైన్స్ గురించి చెప్పుకోక తప్పదు.

మత చాందస భావాలను చిన్నతనం నుంచి ప్రేరేపించి, తద్వారా లబ్ధి పొందాలని ఆశిస్తున్న రాజకీయ నాయకుల కుళ్లు, కుతంత్రాలు వాస్తవం కాదని, సైన్స్ ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని రుజువు చేసేలా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు ఏర్పాటు చేసిన అంశాలను చూస్తే మనకు తెలుస్తోంది. కంచరపాలెం, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులతో పాటు తగరపువలస ఎన్ఆర్ఐ, గాయత్రి విద్యా పరిషత్ (జివిపి) మెడికల్ కాలేజీల విద్యార్థులు వివిధ అంశాలపై సైన్సు ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ప్రత్యేక ఏర్పాటుతో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సైన్స్ ప్రాముఖ్యతను గుర్తెరిగేలా చక్కటి కార్యక్రమం ఏర్పాటు చేసింది.

జన విజ్ఞానం వేదిక ఏర్పాటు చేసిన కార్యక్రమం ఐక్యత, సమైక్యత. ప్రస్తుత సమాజంలో ఐక్యత,సమైక్యత ప్రాధాన్యత ఎంతో ఉందని తెలియజెప్పేలాఒక యూనిట్ ఏర్పాటు చేశారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఇది ఒక హైలెట్ గా చెప్పుకోవచ్చు. సిఐటియు 18వ జాతీయ మహాసభలను గుర్తు చేస్తూ, ఒక్కొక్క మహాసభ వివరం తెలుపుతూ 18 మహాసభల పత్రాలను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంలో ఒక చిన్న సర్క్యులర్ రైలు (బ్యాటరీతో నడిచే) ఏర్పాటు చేసిన తీరు అద్భుతంగా ఉంది.

ఇక ప్రింటింగ్ రంగంలో రోజు రోజుకు నూతన పోకడలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో వస్తున్న 3 డి ప్రింటింగ్ ఒకటి. కొంతమందికి మాత్రమే దీని గురించి తెలిసినప్పటికీ, 3డి ప్రింటింగ్ మిషన్ ఏ విధంగా పనిచేస్తుందో అవగాహన కలిగించే కార్యక్రమాన్ని పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ఏర్పాటు చేశారు. పెట్రోల్, డీజిల్ వినియోగం వచ్చే కాలుష్యం మానవాళికి హానికరం. దీనికి ప్రత్యామ్నాయం ఉందని నిరూపించేలా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ఏర్పాటు చేసిన కస్ప్రెస్ ఎనర్జీ యూనిట్ ప్రాజెక్టు రుజువు చేస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మోడల్ పనితీరును తిలకించడానికి వచ్చిన వారికి విద్యార్థులకు ఎంతో చక్కగా, అర్థమయ్యేలా వివరిస్తున్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విద్యుత్తు జనరేషన్ (ఉత్పత్తి) నుంచి మనం వాడుకునే వరకు జరిగే వివిధ పరిణామక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ఆసక్తికరంగా ఉంది. సోలార్ విద్యుత్తు అవసరం గురించి చెబుతూ, దాన్ని ఎలా పొందవచ్చో వివరిస్తున్నారు.

గాయత్రీ పరిషత్ (జివిపి) మెడికల్ కాలేజీ విద్యార్థులు మానవ శరీరంలో వివిధ భాగాలు ఏ విధంగా పనిచేస్తాయనే ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ, మెదడు, శరీరంలోని వివిధ భాగాల పనితీరును ఈ యూనిట్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థులకు వివరిస్తున్నారు. ఇదే సందర్భంగా విశాఖ వంటి నగర ప్రాంతంలో అధికంగా ఉన్న అధిక బరువుతో మనిషి ఎదుర్కొనే ఆరోగ్య ఇబ్బందులు గురించి, ఈ సమస్యను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నారు. పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి కూడా చెప్పడం విశేషం. ఇక దోమల వల్ల కలిగే నష్టాలు, ముఖ్యంగా డెంగీ వంటి ప్రమాదకరమైన జ్వరం గురించి వివరిస్తూ, ఈ జ్వరం ఎందుకు వస్తుంది, అది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరిస్తున్నారు.

తగరపువలస ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ విద్యార్థులు గుండె జబ్బులు అధికంగా రావడానికి గల కారణాలు గురించి వివరించే ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. షుగర్ వ్యాధి రాకుండా, వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. గుండె జబ్బులు రావడానికి ముఖ్య కారణం ఆల్కహాల్, స్మోకింగ్ వంటివి ప్రమాదకరమని, వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. నిత్యం వ్యాయామం చేయాల్సిన అవసరం గురించి వివరిస్తూ, పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వివిధ చార్టులను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా బిపి, బరువు తెలుసుకునే యూనిట్ ఏర్పాటు చేశారు. ఇది కూడా బాగా ఆకట్టుకుంది. ఇవే కాకుండా మరెన్నో ఆసక్తికరమైన సైన్స్ యూనిట్లు ఇక్కడ ఏర్పాటు చేయటం విశేషం. ఇంత చక్కటి సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కారణమైన సిఐటియు 18వ మహాసభలు విజయవంతం కావాలని ఆశిద్దాం.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న ఓ నమూనా

సైన్స్ ఎగ్జిబిషన్‌కు పోటెత్తిన విద్యార్థులు, నగర వాసులు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
మంగళవారం 30 డిసెంబర్ 2025

కోలాటం ప్రదర్శిస్తున్న విశాఖ మహిళా కళాకారులు

సాగర తీరాన.. కార్మిక పండగ

శ్రామిక ఉత్సవ్‌కు విశేష స్పందన
మూడో రోజూ సందడిగా కళా, విజ్ఞాన, సాంస్కృతిక వేదికలు

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సన్నద్ధంగా సాగర తీరంలో తలపెట్టిన 'శ్రామిక ఉత్సవ్' పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ నెల 27న ప్రారంభమైన ఈ ఉత్సవ్ ప్రాంగణం ప్రజానీకం ఉత్తేజ, ఉత్సాహ డోలికలతో కొత్త సందడిని సంతరించుకుంటోంది. మూడో రోజు సోమవారం సాయంత్రం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అధ్యక్షతన 'స్త్రీ పురుష సమానత్వం' థీమ్‌తో జరిగిన సభకు ముఖ్య అతిథిగా కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ హాజరై అభ్యుదయ, విప్లవకర సినిమా పాటలతో అలరించారు. శ్రామిక సంస్కృతిని తెలియజెప్పారు. సభకు ముందు ఆయన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోగల బుక్‌స్టాల్స్ అన్నీ కలియతిరిగారు. సభికులందరినీ ఏకరీతిన ఆనందోత్సాహంలో ముంచెత్తుతూ మరో విశిష్ట అతిథి జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ పుస్తక మహోత్సవ స్టాల్స్‌ను సందర్శించారు. సైన్స్, ఫొటో ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి.

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

బాల కళాకారులకు ప్రసంశాపత్రాలు అందజేస్తున్న సుద్దాల అశోక్‌తేజ, చిత్రంలో నర్సింగరావు, రమాదేవి

ఆకట్టుకున్న విభిన్న కళారూపాలు

ప్రజాశక్తి - భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో విశాఖ ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు మూడో రోజు అదే ఉత్సాహంతో కొనసాగుతున్నాయి. కవి యాదగిరి రాసిన "ఆటాడుకుందాం.. పాట పాడుకుందాం... అందరం కూడా మాట్లాడుకుందాం.. అన్న ఆనాటి రోజులను గుర్తు చేస్తూ 'ఆటలన్నీ పోయే, మాటలన్నీ కనుమరుగాయే' పాటను పాడుతూ ఆకట్టుకున్నారు. ఇంటింటా ఇంటర్నెట్, చేతిలో సెల్ ఫోన్, ఇంట్లో టీవీ, జన బాహుల్యంలోకి రావడంతో విదేశీ సంస్కృతి జడలు విప్పుతున్న వైనాన్ని పాట రూపంలో కళాకారులు వివరించారు.

నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే, ప్రభుత్వాసుపత్రులు, విద్య ప్రైవేటీకరణ అవుతున్న నేపథ్యాన్ని వివరిస్తూ పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ఎండగడుతూ.. 'ప్రతిదీ ప్రైవేటు రా... ప్రజలపైన వేటు రా .. దేశానికి చేటు రా' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు అనిల్ పాడిన పాట సభికులను ఆలోచింపజేసింది. మన డబ్బుతో నిర్మించిన ఫ్యాక్టరీలు బహుళ జాతి సంస్థలకు పాలకులు ఎలా కట్టబెడుతోందోకళాకారుల పాట రూపంలో వివరించారు.

అరకు, పద్మాపురం గ్రామాలకు చెందిన గిరిజన మహిళలు, పురుషులు ప్రదర్శించిన "థింసా నృత్యం" గిరిజనుల ఐక్యతను చాటేలా ఉంది. లయబద్ధంగా గిరిజన డప్పు కళాకారుల వాయిద్యం, థింసా నృత్యం సభికులను కట్టి పడేసింది. మతాలు వేరైనా మనమంతా ఒక్కటిగా నిలవాలన్న సందేశాన్ని ఇచ్చే 'ఆత్మలను పలికించేదే అసలైన భాష, ఆ విలువ కరువైపోతే అది కంఠశోష" అన్న పాటను ప్రజానాట్య మండలి రాష్ట్ర కళాకారులు ఆలపించారు.

పూలే, సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళలకు చదువు ప్రాధాన్యత తెలుపుతూ రాజేశ్వరి బృందం ఆధ్వర్యంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చిన్నారులు ప్రదర్శించిన 'మన జీవితాల్లో వెలుగులు నింపెను, వెలుగుల రాదారి" నృత్యం సభికులను ఆలోచింప జేసింది. 'ఈ దేశపు తొలి పంతులమ్మగా చేరి, మన జీవితాల్లో నింపెను వెలుగులు' అన్న పాట ఆకట్టుకుంది.

'సంపద సృష్టికి మూలం, చెమట చుక్కలే' అంటూ ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఐవి పాడిన గేయం కష్ట జీవులు, కార్మికుల శ్రమను గుర్తుచేసింది. అలాగే 'సుత్తీ, కొడవలి అందుకో' చెమట చుక్కలా ఎర్ర జెండా' అంటూ ఆయన ఆలపించిన గేయం ఎర్ర జెండా ప్రాధాన్యత, విశిష్టత ను తెలిపింది.

'దేశమంటే మట్టి కాదోయ్'... 'దేశమంటే మనుషులోయ్'

అన్న గురజాడ మాటలను ప్రస్తావిస్తూ గురజాడ గొప్ప తనాన్ని, తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ ఏలూరు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు.

'ఘనమైన చరితే నీది ఎర్ర జెండా'
'నీకుంది పేద ప్రజల అండ దండ'

అంటూ ఎర్ర జెండా ప్రాధాన్యతను తెలుపుతూ ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకులు జగన్ ఆధ్వర్యంలో కళాకారులు పాడిన గేయం సభికులను ఉత్సాహ పరిచింది.

కేరళ మాజీ మంత్రి టిపి.రామకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న నర్సింగరావు తదితరులు

కరీంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సుద్దాల అశోక్‌తేజకు అపూర్వ స్వాగతం

మాట్లాడుతున్న అశోక్ తేజ

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కరీం, రామకృష్ణన్ తదితరులు

ఆకట్టుకున్న కళారూపాలు

గురజాడ స్ఫూర్తి గీతానికి కళాకారుల నృత్య ప్రదర్శన

కేరళ కళాకారుల సంప్రదాయ నృత్యం

అల్లూరి సీతారామరాజు నాటికలోని ఓ సన్నివేశం

ఉత్సవ్ ప్రాంగణంలో కళాకారులు

జివిఎంసి కమిషనర్‌తో కరీం, టిపి.రామకృష్ణన్ మాటామంతీ

మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ, చిత్రంలో రాంభూపాల్, హరికిషోర్, మధు, రాజేష్‌రెడ్డి

పుస్తకం జ్ఞాన శిఖరం : సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

సిఐటియు 18వ జాతీయ మహాసభల సందర్భంగా విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవం మూడో రోజు అత్యంత ఉత్సాహభరితంగా సాగింది ఈ ప్రదర్శనను సోమవారం సాయంత్రం ప్రముఖ సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ వీక్షించారు. పుస్తక ప్రదర్శనలోని వివిధ స్టాల్స్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పుస్తకం గొప్పతనాన్ని కొనియాడారు. మానవ పరిణామ క్రమంలో పుస్తకం ఒక గొప్ప ఆయుధం. అది కేవలం అక్షరాల సమాహారం కాదు, తరతరాల అనుభవాన్ని, జ్ఞానాన్ని అందించే మార్గదర్శి అని పేర్కొన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవడానికి, అన్యాయాలను ఎదిరించడానికి పఠనాసక్తి ఎంతో అవసరమని సూచించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన అరుదైన గ్రంథాలను, చారిత్రక, రాజకీయ విశ్లేషణలతో కూడిన ప్రత్యేక పుస్తకాలను సుద్దాల ఆసక్తిగా వీక్షించారు. కొన్ని పుస్తకాల పూర్వపరాలను, వాటి విశిష్టతను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుస్తక మహోత్సవాలు ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఆలోచనా దృక్పథాన్ని పెంపొందిస్తాయని ప్రశంసించారు.

నిర్వాహకులకు అభినందనలు

సిఐటియు మహాసభల నేపథ్యంలో కేవలం రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా, విజ్ఞానాన్ని పంచే పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అశోక్‌తేజ అభినందించారు. ఈ ప్రదర్శనకు వస్తున్న విశేష స్పందన పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. సుద్దాల అశోక్ తేజ రాకతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన రచయితను చూడడానికి, ఆయనతో ఫోటోలు దిగడానికి సందర్శకులు పోటీ పడ్డారు. ప్రతి ఒక్కర్నీ చిరునవ్వుతో పలకరిస్తూ, ఆప్యాయంగా వారితో ఫోటోలు దిగి అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రతినిధులు, పుస్తక ప్రేమికులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

'శ్రామిక ఉత్సవ్'ను సందర్శించిన జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి ఎంవిపి కాలనీ

ఈనెల 31 - జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలు సందర్భంగా ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన 'శ్రామిక ఉత్సవాల'ను జివిఎంసి కమిషనర్ పి.కేతన్‌గార్గ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా 'బాల్య వివాహాలను నిర్మూలిద్దాం' అన్న అంశంపై ప్రదర్శించిన లఘుచిత్రాన్ని ఆయన వీక్షించారు. సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి చిత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. అలాగే చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సైన్స్, ఫోటో,కార్టూన్ ప్రదర్శనలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఫోటో ఎగ్జిబిషన్ చరిత్రకు అద్దం పట్టేలా ఉందని కొనియాడారు. పుస్తక ప్రదర్శనను సందర్శించిన ఆయన ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. చివరిగా సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉన్నాయని, ఈ మహాసభలు, అనుబంధ కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరుకుంటున్నానని అన్నారు.

పోరాటాల రంగం... సిఐటియు సంఘం

విజయనగరంలో కార్మికులు చేపట్టిన భారీ ర్యాలీ

సమస్యలపై ఎన్నో ఆందోళనలు

నిర్బంధాలను ఎదుర్కొంటూ.. నిర్భయంగా ముందుకు సాగుతూ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కార్మికులకు అండగా... శ్రమజీవులకు శక్తిగా... చిరుద్యోగుల గుండె చప్పుడుగా అనేక పోరాటాలు, ఎన్నో విజయాలు, మరెన్నో ప్రగతిశీల లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సిఐటియు మరో అడుగు ముందుకు వేస్తోంది. ఓవైపు పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తుల శ్రమదోపిడీ, ఉద్యోగులపై వేధింపులు పెరుగుతుండగా, మరోవైపు ఎర్రజెండా నీడలో సిఐటియు ఆధ్వర్యాన విజయనగరం జిల్లాలో పోరాటాలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. పోరాటాల ద్వారా ఎన్నో కార్మికులు ఎన్నో సమస్యలను పరిష్కరించుకున్నారు. ఇటువంటి సందర్భంలో సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు పక్కనే ఉన్న విశాఖ జిల్లా వేదికైంది. బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 31 నుంచి జనవరి 4వరకు జరగనున్నాయి. ఈ మహాసభల నేపథ్యంలో విజయనగరం జిల్లాలో సిఐటియు చేసిన పోరాటాలు, విజయాలను కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు.

విజయనగరం జిల్లాలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు, హక్కులను పరిరక్షించుకునేందుకు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. మరిన్ని సమస్యలు పరిష్కరించుకుని యాజమాన్యాల మెడలు వంచారు. కొన్ని దశాబ్దాలుగా జిల్లాలో ప్రధానమైన జ్యూట్, ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడడం వల్ల జిల్లా పారిశ్రామికంగా మరింత వెనుకబడిన విషయం విధితమే. ఈస్ట్‌కోస్ట్, అరుణా, బొబ్బిలి గోపాలకృష్ణ, జ్యోతి జ్యూట్ మిల్లులు మరికొన్ని పరిశ్రమల స్థలాలు రియల్ ఎస్టేట్‌గా మారిపోయాయి. దీంతో పారిశ్రామిక రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20వేలమంది కార్మికులు శాశ్వతంగా ఉపాధికి దూరమయ్యారు. ఈ ప్రభావం విజయనగరం, గరివిడి, కొత్తవలస, బొబ్బిలి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పారిశ్రామిక సంక్షోభాన్ని అధిగమించి జిల్లాలో నిలదొక్కుకుంటున్న మైలాన్, హెచ్‌బిఎల్, సిపి ఆక్వా, ఎస్ఎంఎస్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలతో పాటు హేచరీస్, పౌల్ట్రీస్ తదితర పరిశ్రమల్లో కార్మికులు రకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వమే ఇసుక వ్యాపారం మొదలెట్టిన తర్వాత నిర్మాణ రంగ కార్మికులు చాలా వరకు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రంగం ఈ రంగం కాదు. అన్ని రంగాల్లోనూ కార్మికులు ఇబ్బందులు పడుతు న్నారు. మరోవైపు రెండో ఎఎన్ఎం, విఆర్ఎలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు సమస్యలైతే అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత లేదు. పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. బండెడు చాకిరీ మోస్తున్నా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థి తుల్లో వీరికి సిఐటియు అండగా నిలుస్తూ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోంది.

గర్భాం ఆంధ్రా ఫెర్రో కార్మికులు చేపట్టిన ఆకలియాత్ర (ఫైల్)

తలపెట్టిన పోరాటాలు.. సాధించిన విజయాలు

- మైలాన్‌లో 2020లో కాంట్రాక్టు వర్కర్స్‌కు జరిగిన వేతన ఒప్పందంలో ఒక్కొక్క కార్మికునికి రోజుకు రూ.72 వేతనం పెరిగింది.
- మైలాన్‌లో ఆపరేటర్లు 2021లో జరిగిన వేతన ఒప్పందంలో భాగంగా ఒక్కొక్క కార్మికునికి నెలకు రూ.8వేలు వేతనం పెరిగింది.
- భోగాపురం శ్రీనివాస హేచరీస్‌లో 2021 లో వేతన ఒప్పందం జరిగింది. ఈ సందర్భం గా ఒక్కొక్క కార్మికునికి నెలకు రూ.2,500 నుంచి రూ.3వేల వరకు పెరిగింది.
- గరివిడి మైన్స్‌లో 2020లో జరిగిన వేతన ఒప్పందం ద్వారా ఒక్కొక్క కార్మికునికి రోజు రూ.600 వేతన ఒప్పందం జరిగింది. 58 రోజులు వేతనాన్ని గ్రాట్యూటీగా సాధించుకున్నారు.
- విజయనగరంలోని చందనా బ్రదర్స్ కోవిడ్ కాలంలో మూసివేయగా, మూడునెలల పాటు పోరాటం సాగింది. కార్మికులకు శాశ్వత సెటిల్‌మెంట్ జరిగింది. ఒక్కొక్క కార్మికుడు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల సాధించుకున్నారు.
- 2023లో అంగన్వాడీలు 42రోజుల సమ్మె కాలంలో విజయనగరం జిల్లాలో 13చోట్ల శిబిరాలు నడిచాయి. ధర్నాలు, రాస్తారోకో వంటి ఆందోళనలు చేపట్టారు. మంత్రుల ఇళ్లముట్టడి కార్యక్రమాలకు కూడా వెనుకాడలేదు. ఫలితంగా 60ఏళ్ల రిటైర్‌మెంట్ వయసును ప్రభుత్వం 62ఏళ్లకు పెంచారు. ఉద్యోగ విరమణ సందర్భంగా వర్కర్లు రూ.1.50లక్షలు, ఆయాలకు రూ.50వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రకటించింది. మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు వర్కర్లకు ప్రమోషన్ కల్పించేందుకు ప్రభుత్వం దిగివచ్చింది.
- ఈ ఏడాది గజపతినగరం మండలం రామన్నపేటలోని అంగన్‌వాడీ వర్కర్‌ను రాజకీయ కక్షసాధింపులతో తొలగింపునకు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి అధికార యంత్రాంగం దిగిరాక తప్ప లేదు.
- ఈ ఏడాది ఆశా వర్కర్లు సిఐటియు అండతో వివిధ సమస్యలపై డిఎం అండ్ హెచ్ఒ, కలెక్టర్ ఆఫీస్ వద్ద 6 గంటల పాటు వంటా, వార్పు కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టారు. ఈ క్రమంలో ఆశా కార్యకర్తలు మెటర్నటరీ వేతనంతో కూడిన సెలవుతోపాటు అనేక సమస్యలను పరిష్కరించుకున్నారు.
- 2024లో నెల్లిమర్ల మిమ్స్ కార్మికులు తొలగింపు, బకాయి డిఎలు, పని ఒత్తిడి తగ్గించాలని 2 నెలలకు పైగా సమ్మె జరిగింది. తొలుత మొండిగా వ్యవహరించిన యాజమాన్యం, ప్రభుత్వ జోక్యంతో దిగరాక తప్పలేదు. 23 మందిపై అక్రమ కేసులు పెట్టి 13 రోజుల పాటు సెంట్రల్‌జైలు, సబ్‌జైల్లో పెట్టారు. చివరకు రాష్ట్ర నాయకత్వం సహకారంతో లేబర్ ఆఫీస్‌లో ఒప్పందం కుదిరింది. నూతన వేతన ఒప్పందం చేశారు.
- ఈ ఏడాది గరివిడి మండలం దేవాడ మైన్స్ లీజు ఒప్పందం పూర్తయిన నేపథ్యంలో స్థానిక కార్మికుల తొలగింపు చర్యలు సిఐటియు పోరాటంతో ఆగాయి.
- రామభద్రపురం, ఎస్.కోట, పురిటిపెంట, గజపతినగరం, ఎల్.కోట, గరివిడి మేజర్ పంచాయతీల్లో జీతాలు పెంచాలని, బకాయి జీతాలు చెల్లించాలని 4 రోజుల నుంచి 26 రోజుల వరకు వివిధ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ల సమ్మె శిబిరాలు జరిగాయి.
- ప్రమోషన్లు ఇవ్వాలని సచివాలయ ఎఎన్ఎంలు కొంతకాలంగా పోరాడి విజయం సాధించారు. ఫలితంగా 156 మంది ప్రమోషన్లు పొందారు.

కవులే శ్రామికోద్యమ నిర్మాతలు

- జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం కీలకపాత్ర

- ఎయు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వెలమల సిమ్మన్న

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

కవులు, రచయితలు శ్రామికోద్యమానికి నిర్మాతలు కావాలని ఆంధ్రాయూనివర్శిటీ తెలుగు విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వెలమల సిమ్మన్న ఆకాంక్షించారు. ప్రభుత్వ విధానాల వల్ల నేడు కార్మికవర్గం తీవ్ర ఒత్తిడి, శ్రమదోపిడీ ఎదుర్కొంటుందని, భవిష్యత్తులో మరింత నిర్బంధ చర్యలు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నాటి జాతీయోద్యమ స్ఫూర్తితోనే కార్మికోద్యమానికి సన్నద్ధం కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ జరుగుతున్న శ్రామిక సాహితీవేదికపై 'జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం' అన్న అంశంపై సాహితీ స్రవంతి శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షతన సభలో ఆయన మాట్లాడారు. జాతీయోద్యమంలో తెలుగునాట కవులు, రచయితలు, కళాకారులు కీలకపాత్ర పోషించారంటూ చరిత్రను వివరించారు. నాడు కవులు కుల, మతాలకతీతంగా ప్రజలను ఐక్యంచేసి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు కృషి చేస్తే, నేటి పాలకులు మతాల మధ్య చిచ్చుపెడుతూ ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా కార్మికుల ఐక్యతను దెబ్బతీయడం ద్వారా వారిపై భారాలు మోపడం, భద్రత లేకుండా చేయడం, శ్రమను దోచుకోవడం వంటివాటికి పాల్పడుతున్నారని వివరించారు. ఇటువంటి తరుణంలో 'స్వాతంత్ర్యం వచ్చెనని సంబర పడగానే సరిపోదోయి... సాధించిన దానికి సంతృప్తిని పొంది, అదే విజయమనుకుంటే పొరపాటోయి' అంటూ శ్రీశ్రీ రాసిన గేయాన్ని నేటి కవులంతా స్ఫూర్తిగా తీసుకుని ముందుకు తీసుకెళ్లాని పిలుపునిచ్చారు. కవి, తెలుగు పండితులు బాడాన శ్యామలరావు మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అన్ని కీలక సందర్భాల్లో తెలుగు కవులు, రచయితలో ప్రజల్ని చైతన్యపర్చారని అన్నారు. కవులు రగిలించిన ఉద్యమ స్ఫూర్తితో స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణాలర్పించేందుకు వెనక్కితగ్గలేదన్నారు. నేడు పాలకులు మోపుతున్న కష్టనష్టాలపై కవితలు రాస్తే తట్టుకోలేకపోతున్నారని, ఫలితంగా శ్రామికుల సమస్యలు మరుగునపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ నేతరం కవులు జాతీయోద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. 'మాకొద్దీ తెల్లదొరతనం' అంటూ కవి గరిమెళ్ల సత్యనారాయణ బ్రిటీష్ పాలకులపై గర్జించిన తీరును అర్థం చేసుకుని ముందుసాగాల్సిన అవసరం ఉందన్నారు. డివి సూర్యారావు మాట్లాడుతూ గురజాడ మొదలుకుని ఎంతో మంది కవులు దేశభక్తి భావాలను రగిలించి, స్వాతంత్రోద్యమం కోసం పరితపిస్తే నేటి పాలకులు ఆ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని అన్నారు. జాతిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో కవులు, రచయితలు మరోసారి సమయాత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. బద్రి కూర్మారావు మాట్లాడుతూ శ్రీకాకుళం గిరిజన

మాట్లాడుతున్న డాక్టర్ సిమ్మన్న

రైతాంగ పోరాటం, మందస జమిందారీపోరాటం, నైజాం వ్యతిరేకోద్యమాల్లో కూడా తెలుగు సాహిత్యం కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. సభాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ గురజాడ, కందుకూరి, శ్రీశ్రీ, ఉన్నవల లక్ష్మీనారాయణ వంటి కవులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా నేటి సమాజంలో శ్రామికవర్గంపై జరుగుతున్న దాడితో పాటు విచ్ఛిన్నకర శక్తుల కుట్రను కవితులు, రచనల ద్వారా బయటపెట్టి, ప్రజల్ని అప్రమత్తం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శి పెంటకోట రామారావు, నాయకులు చలపతిరావు పాల్గొన్నారు. సభలో ప్రసంగించిన కవులందరికీ సాహితీ స్రవంతి నాయుల చేతులమీదుగా శ్రమ అవార్డులు ప్రదానం చేశారు.

ప్రజాశక్తి
మంగళవారం 30 డిసెంబర్ 2025

బలహీన వర్గాలకు ప్రభుత్వం అండ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

బడుగు బలహీన వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ముంజేరు పార్టీ కార్యాలయంలో సోమవారం డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన పిన్నింటి రాజుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.81,419ల విలువైన చెక్కును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్థికంగా వెనుకబడిన, అత్యవసర వైద్య అవసరాలు ఉన్న పేద కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

బ్యాడ్మింటన్ పోటీలకు హారిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన బి. హారిక దక్షిణ భారత ఇంటర్ యూని వర్సిటీ సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఫ్రెండ్స్ బ్యాడ్మి ంటన్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొ ట్నూరు శ్రీరాములు సోమవారం తెలి పారు. ఈ ఎంపిక పోటీలు ఈనెల 11, 12 తేదీలలో ఆంధ్ర యూని వర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగా యని, ఈ ఎంపిక పోటీలకు సెలక్షన్ కమిటీ మెంబెర్‌గా రెడ్డి శివకుమార్ వ్యవహరించారన్నారు. హారిక ప్రస్తుతం ఎస్ కోట పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ రెండో సంవత్సరం చదువు తుందని, అనేక రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనబరి చిందని చెప్పారు. జనవరి 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాజ మండ్రిలో నిర్వహించబోవు దక్షిణ భారత ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ తరపున పాల్గొం టుందని తెలిపారు. ఈ దక్షిణ భారత సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలలో 6 రాష్ట్రాల యూనివర్సిటీలకు చెందిన సుమారు 150 మహిళా టీములు పాల్గొంటా యన్నారు. ఎంపికైన హారి కను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవ రావు, ఫ్రెండ్స్ బ్యాడ్మి ంటన్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసి యేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వి సత్యకర్, స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఏఎస్ వెంకట్రావు, ఆనల మోహన్, ఆనల రమేష్ అభినందించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి- బొబ్బిలి

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇది స్వచ్ఛందమైన ప్రక్రియ అని అభ్యుదయ విద్యా సంస్థలు, అభ్యుదయ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ చింత శారద అన్నారు. సోమవారం బొబ్బిలిలోని గౌడ వీధిలో గల అభ్యుదయ పాఠశాలలో యన్‌వియన్ బ్లడ్ బ్యాంక్, బొబ్బిలి బ్లడ్ సెంటర్ సహకారంతో స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని అభ్యుదయ విద్యా సంస్థలు కరెస్పాండెంట్ యం.కె.నాయుడు (నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. యువత రక్తదానం పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ శిబిరంలో 144 మంది రక్తదానం చేశారు. రాజా కాలేజ్ కరస్పాండెంట్ సుజయ్‌నాయన విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు సాయి కుమార్, యన్‌వియన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, బొబ్బిలి బ్లడ్ సెంటర్ ఈశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న శారద

ఎమ్మెల్సీ విక్రాంత్ పరామర్శ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మరువాడ గ్రామ మాజీ సర్పంచ్ సింగిరెడ్డి ఆదినారాయణ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ తలె రాజేష్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి వైసిపి తరపున అన్ని విధాలుగా తోడుంటామని భరోసా కల్పించారు. కొప్పరవలస గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ తల్లి మృతి చెందడంతో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావిల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శనరావు, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, పాలవలస ధవళేశ్వరరావు, కనగల పారినాయుడు, బొంతు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సత్యవతమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి- బాడంగి

మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు తల్లి సత్యవతమ్మకు పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని ముగడ కాలనీలో సోమవారం తెంటు సత్యవతమ్మ పెద్ద కర్మ కార్యక్రమాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు భార్య రేష్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రంలో బంధువులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ప్రత్యేకంగా హాజరై సత్యవతమ్మకు నివాళు లు అర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సత్యవతమ్మ ప్రజల పట్ల చూపిన అనురాగం, సేవా భావం, సమాజానికి అందించిన సహాయాన్ని వక్తలు స్మరించారు. ఆమె జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలుకులు సువ్వాడ రవిశేఖర్, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, నియోజకవర్గం నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, మెరకముడిదాం, దత్తిరాజేరు, మండలాలకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

సచివాలయాల్లో తనిఖీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వేపాడ, వల్లంపూడి గ్రామ సచివాలయాలను సోమవారం ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని, అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న ఫ్యామిలీ కార్డు సర్వేను జనవరి 12లోపు పూర్తి చేయాలని సూచించారు. మండలంలో కొనసాగుతున్న అన్ని రకాల సర్వేలు నిర్దేశిత గడువులో పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించి జాబ్ కార్డ్ హోల్డర్లందరూ పనులకు హాజరై 100 పని దినాలు పూర్తిగా సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ రోజుకు సుమారు రూ.300 కూలీ వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కూలీల మస్తర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆటోలకు సీరియల్ నంబర్లు

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్‌కు సోమవారం ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు సమావేశం ఏర్పాటు చేసి ఆటోలకు సీరియల్ నంబర్లు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి విజయనగరం పట్టణంలోనికి వెళుతున్న ప్రతి ఆటో, మ్యాక్సీ వాహనదారులకు సీరియల్ నెంబర్లు ఉండాలని చెప్పారు. జొన్నాడ జంక్షన్, లెండి కాలేజీ జంక్షన్ వద్ద ఆటో స్టాండ్ వారికి సీరియల్ నెంబర్లు కేటాయించామన్నారు. వారితోనే స్టిక్కరింగ్ వేయించి రోడ్డు ప్రమాదాలు పట్ల జాగ్రత్తలు వహించాలని పాసింజర్ పట్ల గౌరవంగా వ్యవహరించాలని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. గంజాయి మత్తు పదార్థాలు వంటివి ఆటోలో రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బల్లంకిలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో సోమవారం పశు ఆరోగ్య, గర్భ కోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించి 20 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 12 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్సలు చేశారు. పెయ్యలకి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కోరాడ గాయత్రి మాట్లాడుతూ పశువులకు పెట్టే మేపులో ఖనిజ లవణ మిశ్రమాన్ని చేర్చడం వల్ల సరైన నిష్పత్తిలో పోషకాలు అందుతాయని తెలిపారు. ఆడ పెయ్యలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు పట్టడం వల్ల త్వరగా ఎదిగి తక్కువ వయస్సులోనే కట్టుకు వస్తాయని తెలిపారు. పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జున్ను పాలను అప్పుడే పుట్టిన దూడలకు పట్టడం వల్ల కలిగే లాభాలు, వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలు మీద అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, సహాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు భరోసా

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగిపాళెం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో పశువుల శాల పూర్తిగా దగ్ధమై తీవ్ర నష్టం వాటిల్లిన ముక్కా శ్రీను, ముక్కా పెద్ద అప్పారావు కుటుంబాలకు విజయనగరం జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ మానవతా ధృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు. అగ్ని ప్రమాదం కారణంగా జీవనోపాధి కోల్పోయిన బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న చైర్మన్, ప్రతి కుటుంబానికి సోమవారం రూ.5వేలు చొప్పున మొత్తం రూ.10వేలు నగదు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుకోని ప్రమాదాల్లో నష్టపోయిన ప్రజలకు అండగా నిలవడం మన బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని చైర్మన్ సేవాభావాన్ని అభినందించారు.

ఆర్థిక సాయం అందిస్తున్న గొంప కృష్ణ

నేనున్నాను...

టిడిపి అరకు పార్లమెంట్ అధ్యక్షులు తేజోవతి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఏ సమస్య వచ్చినా తానున్నానని గుర్తించుకోవాలని టిడిపి అరకు పార్లమెంట్ అధ్యక్షులు మోజోరు తేజోవతి కార్యకర్తలకు సూచించారు. సోమవారం వీరఘట్టంలో టిడిపి పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, మరికొంతమంది నాయకులు ఆమెను కలిశారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గెలుపు కోసం ప్రతి కార్యకర్తా అహర్నిశలు శ్రమించారని ఆమె తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆశీస్సులు, మీ సహాయం కూడా తనకు ఎంతో అవసరమని, రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్లేందుకు సమన్వయంతో కృషి చేద్దామని ఆమె వెల్లడించారు. మీకు ఏ సమస్య వచ్చినా చెల్లిగా అక్కగా, తల్లిగా తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. ముందుగా కంబర గ్రామంలో తోటపల్లి ప్రాజెక్టు చైర్‌పర్సన్ పొదిలాపు విజయరమణి, ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు కుటుంబ సభ్యులు కలిశారు. అనంతరం తేజోవతికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జామి సింహాచలం, కర్రి నాగభూషణరావు, తూముల రమేష్, జంపు చంద్రశేఖర్, కార్యకర్తలు ,పాల్గొన్నారు.

తేజోవతిని సత్కరిస్తున్న టిడిపి నాయకులు

తేజోవతికి ఘన స్వాగతం

పాలకొండ : టిడిపి అరకు పార్లమెంట్ అధ్యక్షులు తేజోవతికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. కోటదుర్గమ్మను ఆమె దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, నాయకులు జాడ శ్రీధర్, తమ్మరావు, దుప్పాడ రమణ, బగాది వెంకటరమణ తదితరులు ఉన్నారు.

టిడిపిలో 140 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని శ్యాంపురం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో వంగర మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన 60 వైసిపి కుటుంబాలు సోమవారం టిడిపిలో చేరాయి. సంతకవిటి మండలంలోని మండరాడ గ్రామానికి చెందిన మరో 80 కుటుంబాలు వైసిపిని వీటి టిడిపిలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల గెలుపును కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఎపి ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్తిబాబు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పోతనాపల్లి గ్రామ మాజీ సర్పంచ్, ఉన్నత విద్యావంతుడు సామాజిక సేవలో ముందుండే వ్యక్తి డాక్టర్ గేదెల సత్తిబాబు ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైనట్లు రాష్ట్ర ఎరుకుల సేవా సంఘం చైర్మన్ పాలపర్తి శ్రీనివాస చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారని గేదెల సత్తిబాబు తెలిపారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ తనపై ఇంత నమ్మకం ఉంచి ఇంత పెద్ద హోదా ఇచ్చిన రాష్ట్ర సంఘం నాయకత్వానికి నా ధన్యవాదాలు తెలిపారు.

రూ.12.49కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం నియోజకవర్గంలో రూ.12 కోట్ల 49 లక్షలతో అభివృద్ధి పనులను అధికారంలోకి వచ్చిన 18నెలలోనే ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి చేపట్టినట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి, మాజీ ప్రధాన కార్యదర్శి జిల్లా ఐవిపి రాజు తెలిపారు. సోమవారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తరువాత నియోజక వర్గంలో రోడ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధపెట్టారాన్నరు. అదేవిధంగా మంచినీటి సమస్యను అధిగమించేందుకు గడిగెడ్డ నుంచి తెప్పించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గాజుల రేగ పిఏసిఎస్ చైర్మన్ కోరాడ వెంకట్రావు, విజ్జపు ప్రసాద్, బంగారు బాబు పాల్గొన్నారు.

ఆర్థిక సహకారం అందించండి

కలెక్టర్‌ను కోరిన వికలాంగ క్రీడాకారుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహకారంతో బాటు వికలాంగ క్రీడాకారులకు (పారా) ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందేలా చూడాలని పారా అంతర్జాతీయ క్రీడాకారుడు యాళ్ళ సత్తిబాబు జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర రెడ్డిని కోరారు. సోమవారం పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్‌తో కలిసి గ్రీవెన్స్ లో వినతిపత్రం అందించారు. జిల్లాకు చెందిన పారా బాడ్మింటన్ క్రీడాకారుడు యాళ్ల సత్తిబాబు ఇప్పటివరకు జాతీయ స్థాయిలో అనేక మెడల్స్ సాధించి జిల్లాకు పేరు తీసుకుని వచ్చాడని, అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచాడని కలెక్టర్‌కు వివరించారు. భవిష్యత్‌లో జరుగబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహకారంతో బాటు క్రీడాకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందేలా చూడాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య తెలిపారు. సోమవారం పిజిఆర్‌ఎస్‌లో ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో ఆక్రమణలు, నీటి సమస్య, విద్యుత్ లైట్లు వంటి పలు సమస్యలపై ప్రజలు నుంచి వినతులు వచ్చాయన్నారు. వాటిని పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎసిపిలు రమణమూర్తి, హరిబాబు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్ సంతాపం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం మండలం దుప్పాడకు చెందిన వైసిపి నాయకులు బద్రి భాస్కర్ నాయుడు తండ్రి బద్రి అక్కు నాయుడు ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు హక్కు నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కెల్ల త్రినాథరావు, సైలాడ పెంటయ్య , పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వీరఘట్టం :బొడ్లపాడు ఫీడర్ 11 కెవి పరిధిలో ఉన్న గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ కె.సోమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్ల తొలగింపు తదితర పనులు చేపట్టనుండటంతో ఉదయం 8 గంటల నుంచి. మధ్యాహ్నా రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కురుపాం :మండలంలోని పులిపుట్టి, గోనుగూడ గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం టిడిపి మండల కన్వీనర్ కెలిశెట్టి కొండయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన రహదారి నిర్మాణం ద్వారా రవాణా సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, సర్పంచ్ థాత్రాజ్, నాయకులు కడాయి, శంకర్, సుబ్బలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్‌కు పోటెత్తిన వినతులు

పరిష్కారంలో ఆలసత్వం వహిస్తే సహించేది లేదు : కలెక్టర్

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న తెలగపాలెం వాసులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్, విజయనగరంకోట

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)కు, రెవెన్యు క్లినిక్‌కు వినతులు పోటెత్తాయి. ఫిర్యాదుదారుల నుండి అధికారులు 232 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కు ప్రజల నుండి వచ్చిన వినతులను వారంలోగా పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వినతులు పరిష్కారంలో అధికారులు ఆలసత్యం వహిస్తే సహించేది లేదన్నారు. రెవెన్యూ శాఖకు వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. అత్యధికంగా రెవెన్యు శాఖకు సంబంధించి 136 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. పిజిఆర్‌ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు.

జిల్లాలో సోమవారం ప్రారంభమైన రెవెన్యూ క్లినిక్ లకు 23 దరఖాస్తులు అందాయి. అందులో విజయనగరం డివిజన్ కు 15, బొబ్బిలి డివిజనకు ఐదు, చీపురుపల్లి డివిజనకు మూడు దరఖాస్తులు అందాయి. వివిధ భూ సమస్యలు పరిష్కార నిమిత్తం దరఖాస్తు చేసుకున్నారని ఆయా డివిజనల్ అధికారులు పేర్కొన్నారు.రెవెన్యూ క్లినిక్‌ల్లో డిఆర్‌ఒ మురళి, విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి ఆర్‌డిఒలు డి.కీర్తి, రామ్మోహన్ రావు, సత్యవాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు డి.వెంకటేశ్వర రావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి. శాంతి, కళావతి, సర్వే శాఖ ఎ.డి. ఆర్.విజయకుమార్, కలెక్టరేట్ ఎఒ దేవి ప్రసాద్, సిపిఒ బాలాజి, జిల్లా పరిషత్ సిఇఒ బి.వి.సత్యనారాయణ, డివిజన్లోని తహశీల్దార్లు పాల్గొన్నారు. పిజిఆర్‌ఎస్‌లో పలుశాఖలో పాల్గొన్నారు.

భూమి పంచుతారా? గద్దె దిగుతారా?

రాష్ట్ర ప్రభుత్వం భూమి పంచుతుందా లేదా గద్దె దిగుతుందా అని అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. ధర్నాలో సాంబయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల బంజరు భూములు ఉన్నాయని, గతంలో ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వ భూములు లేకపోతే కొనుగోలు చేసి ఇచ్చేవారన్నారు ఈ ప్రభుత్వానికి పేదలు జీవించడం ఇష్టం లేదన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దిగి రాకపోతే వచ్చే మార్చి రెండో వారంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహాధర్నాను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రార ఆనందరావు బలగా రాధ, బోని పాల్గొన్నారు.

మా పంచాయతీని యథాతథంగా ఉంచాలి

మా పంచాయతీని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ జామి మండలం భీమసింగి పంచాయతీ తెలగపాలెం ప్రజలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాం మండలం అభివృద్ధి అధికారి భీమసింగి పంచాయతీలో గల తెలగపాలెం గ్రామాన్ని శాసనపల్లి గ్రామపంచాయతీలో గల సామ్యాజుల పాలెంలో కలిపి పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారని తెలిపారు. తమను వేరే పంచాయతీలో కలపవద్దని డిమాండ్‌చేశారు. తప్పుడు నివేదిక ప్రతిపాదన పంపిన అధికారులపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో భీమసింగి సర్పంచ్ జెవిలక్ష్మి, బివి అప్పారావు, మాజీ సర్పంచ్ బి. సంజీవరావు, కంది వెంకట్రావు, జి.జ్యోతి వార్డు మెంబర్, ఎం.సత్యం, బి.రమ, కె.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలం ఇప్పించండి

గుర్ల మండల నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ స్థలం ఇప్పించాలని కోరుతూ చీపురుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావుకు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గండ్రేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వినతి అందజేశారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం : ఎస్‌పి

బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తామని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదికను జిల్లాపోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి సమస్యలు విని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ వారం మొత్తంగా 19 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదు అంశాల్లో వాస్తవాలను గుర్తించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిసిఆర్‌బి సిఐ కె.కుమార స్వామి, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ఎస్‌ఐలు రాజేష్, ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకలను శాంతియుతంగా నిర్వహించాలి

నూతన సంవత్సర వేడుకలను జిల్లాలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని, వేడుకల పేరుతో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి ఎఆర్ దామోదర్ హెచ్చరించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 31 రాత్రి బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదన్నారు. లిమద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. వాహనాలను అతివేగంగా నడిపినా, బైక్ రేసులు నిర్వహించినా, ట్రిపుల్ రైడింగు చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆయా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో అర్ధ రాత్రి ఒంటిగంట తరువాత ప్రజలెవరూ రహదారుల పై తిరగరాదన్నారు. ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్ళలో పోలీసు బందోబస్తు, పికెట్లును ఏర్పాటు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, నృత్యాలు చేయడం, బహిరంగ పార్టీలు నిర్వహించడం, రంగులు పూయడం, డిజే/లౌడు స్పీకర్లుతో పెద్ద శబ్ధం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా మద్యం షాపులు, బార్లపైన కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా సమాఖ్య ద్వారా మొక్కల విక్రయం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ రకాల అలంకరణ మొక్కలు, పూల మొక్కలు, ఇండోర్ మొక్కలు, ఫ్రూట్ ప్లాంట్స్ విక్రయానికి అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు.సోమవారం పిజిఆర్‌ఎస్ లో జిల్లా కలెక్టర్ ను కలసిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి మాట్లాడుతూ, నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 31 నుండి జనవరి 15 వరకు తక్కువ ధరలకు నాణ్యమైన మొక్కలను విక్రయిస్తామనితెలిపారు. 31, 1 తేదీల్లో జిల్లా పరిషత్ కార్యాలయంవద్దగల మిల్లెట్‌షాపు వద్ద, ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద విక్రయిస్తామని తెలిపారు. తరువాత మిల్లెట్ షాపు వద్ద విక్రయాలు కొనసాగుతాయని తెలిపారు. వివరాలకు 8008201398 నంబర్ లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి

కోరం లేక బడ్జెట్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

మునిస్పల్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన బడ్జెట్ సమావేశం కోరం లేక వాయిదా పడింది. సోమవారం ఉదయం 11.30 గంటలకు చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశానికి వైసిపికి చెందిన చైర్ పర్సన్‌తో పాటు ఏడుగురు కౌన్సిలర్లు హాజరయ్యారు. సుమారు 30 నిమిషాలు వేచి ఉన్నప్పటికీ టిడిపికి చెందిన కౌన్సిలర్లు రాలేదు. దీంతో చైర్‌పర్సన్ బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశానికి ముందు చైర్‌పర్సన్ ప్రజారోగ్య అధికారి కె.పకీర్‌రాజుతో మాట్లాడుతూ పట్టణంలో కుక్కల నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. పశుసంచారాన్ని నియంత్రించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ కె.కిశోర్ కుమార్, ఇన్‌ఛార్జి మేనేజర్ రూబెన్ దిబ్బ, డిఇ శ్రీనివాసరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వినయ్‌కుమార్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన సభ్యులు

ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలి

అధికారులకు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం

పిజిఆర్‌ఎస్‌కు 144 వినతులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంతో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలని, ఆ దిశగా వినూత్న రీతిలో కృషి చేయాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకే సమస్యపై ఫిర్యాదులు పలుమార్లు పునరావృతం కాకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని, ప్రత్యేక శ్రద్ధ వహించి పక్కా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులతో సంబంధిత అధికారి తప్పనిసరిగా ఫోన్ ద్వారా సంప్రదించాలని, రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై 144 వినతులు అందజేశారు. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 55 ఉండగా, ఇతర అంశాలకు చెందినవి 89 అర్జీలు ఉన్నాయి. దీనిలో భాగంగా కలెక్టర్ గత వారం జరిగిన పిజిఆర్ఎస్‌పై సమీక్షించి. క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలని సూచించారు. గత నెల, ఈ నెల పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఇందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కొనసాగాలని ఆకాంక్షించారు.

అర్జీల్లో కొన్ని..

కొమరాడ మండలం కొట్టు గ్రామానికి చెందిన ఎన్.శ్రీరాముల నాయుడు తనకు చెందిన భూమి తమ్ముడు పేరున నమోదయిందని పూర్తి దర్యాప్తు చేసి, తన పేరును రికార్డులలో నమోదు చేయాలని దరఖాస్తు అందజేశారు.

పాచిపెంట మండలం గురువునాయుడుపేట గ్రామ రెవెన్యూ పరిధిలో తన భూములకు చెందిన అడంగల్ 1బి ఇప్పించాలని ఎం.గౌరమ్మ వినపత్రం సమర్పించారు.

జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన తలగాపు సత్యనారాయణ అర్జీని అందిస్తూ తాను సాగు చేసుకుంటున్న భూమిని వేరే వారు ఆక్రమించారని, వారిపై తగు చర్యలు తీసుకొని తన భూమిని అప్పగించాలని కోరారు.

సాలూరు మండలం గుమడాం గ్రామానికి చెందిన బి.ఆదినారాయణ, బి.సత్యం భూములను ఆన్‌లైన్లో నమోదు చేయాలని అర్జీ అందజేశారు.

పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన డి.రవి తన వ్యవసాయ భూములకు 1బి చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

సీతంపేట మండలంలో ఉప్పర జమ్మిని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటుచేయాలని రేగుమానుగూడ గ్రామానికి చెందిన సవర సూర్యారావు దరఖాస్తు అందజేశారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం పట్టణానికి చెందిన పి.రజినీ, భామినికి చెందిన టి.సరస్వతి వితంతు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

సీతానగరం మండలం పాపమ్మవలస గ్రామానికి చెందిన ఎన్.అప్పలనాయుడు వికలాంగుల పింఛను ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు మంజూరు చేయాలని వినతి

కురుపాం: మొండెంఖల్ గ్రామానికి 60 వేల లీటర్ల తాగునీటి ట్యాంకు మంజూరు చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో డిఆర్ఒ హేమలతకు టిఆర్ఎఫ్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు లోవరాజు, ఐ.రామకృష్ణ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గ్రామంలో సుమారు 2,500 మంది జనాభా ఉండగా ఇంటింటికీ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. జల జీవన్ మిషన్ మంజూరైన ట్యాంకు రద్దయిందని తెలిపారు. ఈ నేపథ్యంలో 60 వేల లీటర్ల సామర్థ్యం గల కొత్త తాగునీటి ట్యాంకును మంజూరు చేస్తే, గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీతారాం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న టిఆర్ఎఫ్ నాయకులు రామకృష్ణ

మద్యం అమ్మకాలపై నియంత్రణ విధించాలి: ఐద్వా డిమాండ్

పార్వతీపురం: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం అమ్మకాలపై నియంత్రణ విధించాలని, డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీలలో మద్యం అమ్మకాల వేళలు సవరించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శ్రీదేవి, బి.లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మన్యం జిల్లా ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. నూతన సంవత్సర వేడుకలలో యువత విచ్చలవిడిగా మద్యం సేవించి అనేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రమాదం ఉందని చెప్పారు. మహిళలు, ప్రజల ప్రశాంత జీవనానికి ఆటకం కలిగించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో మద్యం అమ్మకాలపై నియంత్రణ విధించాలని డిమాండ్ చేశారు. మద్యం అమ్మకాలు సాయంత్రం 7 గంటల లోపు ముగించేలాగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి వి.ఇందిర, ఉపాధ్యక్షులు ఎం.గౌరమ్మ, జిల్లా కమిటీ సభ్యులు వరాలు, జి తులసి పాల్గొన్నారు.

పంచాయతీల నిధులు దారి మళ్లింపు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గ్రామ పంచాయతీల అభివృద్ధికి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకుండా టిడిపి కూటమి ప్రభుత్వం దారి మళ్లిస్తోందని వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ ఆరోపించారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు టిడిపి కూటమి ప్రభుత్వం దారిమళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలపై కక్ష సాధించేలా ప్రభుత్వ పనితీరు సరికాదన్నారు. గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకునేలా జిల్లా పరిషత్, మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీచేసి తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా ఆర్థిక సంఘం నిధులు నిలిపేయడం అన్యాయమన్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని వైసిపి తరపున రాష్ట్ర కమిషనర్ ఆఫీసుల్లో పెద్దఎత్తున ధర్నాలు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. గతంలో ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడం, దారి మళ్లించడం వల్ల కూటమి ప్రభుత్వానికి కేంద్రప్రభుత్వం మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు.

ఇప్పటికైనా గ్రామాలలో అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చెరువుల కబ్జాతో అడుగంటుతున్న భూగర్భ జలాలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలో చెరువుల ఆక్రమణలను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఒబిసి విభాగం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, నియోజకవర్గ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, ఎస్‌సి సెల్ సీనియర్ నాయకులు కోలా కిరణ్ కుమార్, సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల రామకృష్ణ, మేడిశెట్టి రామ చంద్ర రావు తదితరులు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై చర్చించారు. పార్వతీపురం మున్సిపాలిటీలోని బిళ్లబంద, దేవుడిబంద, నెల్లిచెరువు, లక్ష్మనాయుడు చెరువు, కోదువానిబంద, లంకెల చెరువు, వరహాల గెడ్డ, సంఘం నాయుడు చెరువు, రాయబంద, తమ్మినాయుడు చెరువు, బోటు వారి చెరువు, పాత్రుడు గారి కోనేరు, కొత్తచెరువు, గంగసాగరం తదితర చెరువులు ఆక్రమణకు గురైనట్లు వారు తెలిపారు.

సాలూరు మున్సిపాలిటీలో రాణమ్మ కోనేరు, అగ్రహారం కోనేరు, పేరసాగరం ఆక్రమణకు గురైనట్లు చెప్పారు. చెరువులు కబ్జాకు గురికావడంతో ఏ మాత్రం వర్షం పడినా పార్వతీపురం ముంపునకు గురవుతుందన్నారు.

తక్షణమే పాత రికార్డులు ప్రకారం చెరువులను సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి చెరువుల్లో కబ్జాల తొలగించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

చిన్నప్పటి నుంచి విద్యార్థులు కష్టపడి లక్ష్యంతో చదివినాడే ఉన్న స్థాయికి చేరుకోగలరని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అరిందకుమార్ తెలిపారు. సోమవారం జియ్యమ్మవలస మండలం పెదమేరంగి జంక్షన్‌లో తిరుమల సాయి పాఠశాలను ఆయన సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులకు మెళకువలు గురించి వివరించారు. శక్తిని, సమయాన్ని, ఆరోగ్యాన్ని, లక్ష్యాన్ని, కుటుంబాన్ని గురించి తెలుసుకొని ఏకాగ్రతతో చదివితే అనుకున్న లక్ష్యాలు చేరుకోగలరని చెప్పారు. కార్యక్రమంలో విద్యాలయ వ్యవస్థాపకులు రౌతు సరళకుమారి, హెచ్‌ఎం సతివాడ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

'సరదా చదువులు' ఆధ్వర్యంలో టాలెంట్ హంట్

ప్రజాశక్తి-పాలకొండ

సరదా చదువులు అనే సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో ఐదు, ఎనిమిది తరగతుల విద్యార్థులకు ఫిబ్రవరి నెలలో సత్యసాయి టాలెంట్ హంట్ జూనియర్ టాలెంట్ టెస్ట్-2026 నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వి రమణ, సంపత్ కుమార్ తెలిపారు. పాలకొండ, వీరఘట్టం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, సీతంపేట, భామిని, రేగిడి, బూర్జ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రెండు విభాగాల నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు, తదుపరి ఏడు స్థానాలకు కన్సోలేషన్ పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

చేప పిల్లలు పంపిణీ

ప్రజాశక్తి -భామిని

సీతంపేట ఐటిడిఎ సహకారంతో భామిని మండలంలోని బురుజోల, వడ్డాంగి, బొమ్మిక, మంద్రుంగూడ గ్రామాలలో గిరిజన మత్స్యకారులకు సోమవారం చేప పిల్లలు పంపిణీ చేశారు. ఈ నాలుగు గ్రామాలలో 58 వేల చేప పిల్లలు ఉచితంగా అందజేసి, చెరువులో వదిలినట్లు భామిని మత్స్య సహాయకులు ఎస్. శోభన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

పంచగవ్యతో 20 శాతం అధిక దిగుబడులు

ప్రజాశక్తి-పాచిపెంట

అన్ని పంటలలో పంచగవ్య పూత, పిందె దశలో 15 రోజుల వ్యవధిలో ఎకరానికి మూడు లీటర్లు చొప్పున రెండుసార్లు పిచికారీ చేస్తే 20 శాతం అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పణుకువలస గ్రామంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి విజయ్ ఆధ్వర్యంలో మహిళా రైతు చెల్లూరు గంగమ్మ 10 ఎకరాలకు పంచగవ్య కషాయాన్ని తయారు చేశారు. ఎఒ మాట్లాడుతూ పంచగవ్య తయారీకి ఎకరానికి 350 రూపాయల మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

సీతంపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ డెవలప్మెంట్ అధికారి బి.రామకృష్ణ ఆధ్వర్యంలో కాలువలలో పూడిక తొలగించారు. సర్పంచ్ ఆరిక కళావతి, డిప్యూటీ ఎంపిడిఒ ఎల్.శ్రీనివాసరావు సూచనలు సలహాలు ఇచ్చారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

అంతర పంటలను పరిశీలిస్తున్న డిపిఎం శ్రావణ్‌కుమార్ నాయుడు

అంతర పంటలతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అంతర పంటలతో గిరిజన రైతులు అదనపు ఆదాయం పొందడానికి వీలుంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా డిపిఎం ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు అన్నారు. ఒడిశా రాష్ట్రంలోని ప్రధాన్ స్వచ్ఛంద సంస్థకు చెందిన 16 మంది రైతులతో కలిసి మండలంలోని బాతుగుడబ, పెంగవ, చాపరాయి బిన్నిడి గ్రామాలలో రైతులు అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. జీడి, మామిడి తోటల్లో అంతర పంటలుగా వేసిన పసుపు, అల్లం, పైనాపిల్, కర్రపెండ్లం, తీగజాతులు తదితర పంటల గురించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఆదాయ వ్యయాలపై ఒడిశా రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు బిడ్డిక కుమారి, గీత నిమ్మల, ఎన్ఎఫ్ఎలు తరుణ్ ఆదిత్య, శ్రీను, దేవి ప్రసాద్ ఉన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శేషలత

అన్ని రంగాల్లో స్త్రీ పాత్ర కీలకం

ప్రజాశక్తి-సీతంపేట

అన్ని రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషించి ముందుకు నడిపిస్తున్నారని విశాఖపట్నం బివికె కళాశాల ప్రిన్సిపల్ శేషలత అన్నారు. సీతంపేటలో అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లులతో శక్తి సంఘం ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మహిళ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడిలోవ ఉపాధ్యాయులు సుధారాణి, మంగవేణి, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ గోవిందరాజులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

- నూర్చిన ధాన్యమంతా కొనుగోలు చేయాలి
- కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

సచివాలయాల్లో సిబ్బంది బయో మెట్రిక్ హాజరు తప్పని సరి అని కలెక్టర్ రాంసుండర్‌రెడ్డి తెలిపారు. అర్జీదారుల వినతులు నాణ్యమైన, స్పీకింగ్ ఆర్డర్ రూపం లో సమాధానం ఇవ్వాలని , అర్జీ దారుల సంతృప్తి పెరగాలని అన్నారు. సోమవారం కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ పై సమీక్షించారు. జిల్లా నుండి రెవిన్యూ వినతుల్లో ఎక్కువ శాతం తిరస్కారం అవుతున్నాయని, ప్రతి వినతిని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరగాలని, ప్రస్తుతం నూర్చిన ధాన్యం 30 వేల మెట్రిక్ టన్నుల వరకూ ఉన్నాయని, బుధవారం మొత్తం ధాన్యాన్ని సేకరించాలని తెలిపారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు ఉంటాయని, లక్ష్యాలను సాధించాలని తెలిపారు. టెన్త్ పరీక్షలపై దృష్టి పెట్టాలని, 100 రోజుల ప్రణాళిక అమలు చేసి శత శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ మురళి, జిల్లా అధికారులు, వర్చువల్‌గా ఆర్‌డిఒలు, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : కలెక్టర్

విజయనగరంకోట : డీలర్లు నిబంధనలు ఉల్లంఘించినా, కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లింపుచేసినా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం వ్యవసాయ అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం విత్తిన, భవిష్యత్ లో విత్తనున్న పంటలకు సంబంధించి ఎరువులు అవసరమైన గ్రామాలు, మండలాలను గుర్తించి ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. చెరువులు, ఇతర వనరుల ద్వారా నీటి వసతి బాగా ఉండటంతో, గత ఏడాది కంటే ఈసారి మొక్కజొన్న, కూరగాయల సాగు పెరిగే అవకాశం ఉన్నందున అందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వచ్చే 15 రోజులకు అవసరమైన ఎరువుల పరిమాణాన్ని మండలాల వారీ పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి ముందుగానే అంచనా వేసి, రాష్ట్ర స్థాయికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఎరువుల డీలర్ వద్ద యూరియా నిల్వల వివరాలు తెలియజేసే స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు యూరియా కొనుగోలు చేసే సమయంలో బస్తాపై ముద్రించిన ఎం.ఆర్.పీ ధరలను పరిశీలించి, అదే ప్రకారం ధర చెల్లించి, తప్పనిసరిగా డీలర్ నుండి రసీదు పొందేవిధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. టెలి కాన్ఫరెన్సులో జిల్లా వ్యవసాధికారి విటి రామారావు, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస పాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెచ్ఎం ప్రసన్నలక్ష్మి

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు శుభ్రత స్టాల్ ఏర్పాటు చేయడంతో కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.శ్రీరాములు, డి.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనుదారులు, కుటుంబ పింఛనుదారులు తమ లైఫ్ సర్టిఫికేట్ ను 2026 సంవత్సరానికి తప్పనిసరిగా 2026 జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 లోపు మాత్రమే సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి వి.నాగమహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నవంబర్, డిసెంబర్‌లో సమర్పించిన లైఫ్ సర్టిఫికేట్లు 2026 సంవత్సరానికి చెల్లవని ఆయన తెలిపారు. 2025 లో ముందే లైఫ్ సర్టిఫికేట్ ఇచ్చినవారు కూడా తప్పనిసరిగా జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 మధ్యలో మళ్లీ సమర్పించాలని తెలిపారు. పెన్షన్ విడుదలలో ఇబ్బందులు తలెత్తకుండా సూచించిన తేదీల్లో లైఫ్ సర్టిఫికేట్లు తప్పనిసరిగా సమర్పించవలెనని పెన్షనుదారులకు విజ్ఞప్తి చేసారు. .

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిఎం దాలినాయుడు తదితరులు

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కేలెండర్ విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ 2026 వార్షిక క్యాలెండర్‌ను, పోకెట్ క్యాలెండర్‌ను బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దూసూరి దాలినాయుడు, ఎజిఎం శారద, మురళీధర్, శ్రీనివాస్‌దాస్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అలుగు వెంకట్రావు, లక్ష్మణ కుమార్, అక్కమ్మ, భాగ్యలక్ష్మి, రేవల్ల రమణమ్మ పాల్గొన్నారు.

రెడ్డివానివలసను పంచాయతీగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సీతానగరం

రామవరం పంచాయతీ పరిధిలోని రెడ్డివానివలసను కొత్త పంచాయతీగా ఏర్పాటుచేయాలని గ్రామ పెద్దలు రెడ్డి తిరుపతి నాయుడు, రెడ్డి అప్పలనాయుడు, రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి రమణమూర్తి, మూడడ్ల రాఘవ.. సోమవారం ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి రామవరం పంచాయతీ 2.5 కిలోమీటర్లు, సచివాలయం 3.5 కిలోమీటర్లు దూరమని, కోఆపరేటివ్ బ్యాంకుకు, హైస్కూల్‌కు వెళ్లాలంటే 3.5 కిలోమీటర్లు దూరం వెళ్లాలని తెలిపారు. మధ్యలో మూడు రైల్వే లైన్లు ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెడ్డివానివలసను పంచాయతీగా గుర్తించి గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వారు కోరారు.

కార్యకర్తలను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ఉత్తమ కార్యకర్తలకు ఎమ్మెల్యే సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో కార్యక్రమాలను డోర్ టు డోర్ ప్రచారం చేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి సన్మానించారు. సోమవారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలకు సన్మాన పత్రంతో శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం తోనే సంక్షేమం, అభివృద్ధికి శ్రీకారం చుట్టారని అన్నారు. అన్న క్యాంటీన్, పింఛన్ల పెంపు, స్త్రీశక్తి పథకం అమలు, టైటిల్ డీడ్ వంటి వాటికి ఆమోదం తెలుపుతూ ప్రజలలో మన్ననలు పొందారన్నారు. తాగునీటి సౌకర్యార్థం గడిగెడ్డ, చంపావతి, నాగావళి నదులు అనుసంధానం ఎంతో అవసరమన్నారు, దానికి జీవో నెంబర్ 44 ద్వారా అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మాజీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాసి అప్పలనాయుడు, ఎఎంసి ఛైర్మన్ కర్రోతు నర్సింగ్ రావు, జొన్నవలస, గాజులరేగ పిఎసిఎస్ ఛైర్మన్లు అప్పన్న బాబు, కోరాడ వెంకట్రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బొద్దల నర్సింగరావు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు, పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఐఎఎస్ అధికారి కూర్మారావు

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

ఐఎఎస్ అధికారి కూర్మారావు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

విద్యార్థులు లక్ష్యంతో చదవాలని కర్ణాటక రాష్ట్రం ఐఎఎస్ అధికారి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కూర్మారావు అన్నారు. సోమవారం ఆయన స్వగ్రామం పోరలి వచ్చిన ఆయన తాను చదువుకున్న పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఈ గ్రామంలోనే చదివానని, ఇప్పుడు తల్లిదండ్రులను చూసేందుకు వచ్చానని చెప్పారు. ఇందులో భాగంగా గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎపిసి రామారావుతో కలిసి సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కష్టపడి చదివితే మంచి అవకాశాలు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు, మాటలు విని పట్టుదలతో చదివితే మంచి ఉన్నత స్థానాలకు ఎదగవచ్చు అన్నారు. తాను ఈ పాఠశాలలో చదివి ఐఎఎస్ ఉద్యోగం సాధించానని, తన లాగా కష్టపడి చదివి మంచి ప్రయోజకులు అవ్వాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చదువు కోసం ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. స్కూల్‌కు ఏమైనా కావాలను కుంటే తాను సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏం వెంకట్రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముంజేరు దళితులను ప్రభుత్వం ఆదుకోవాలి

మహిళల దీక్షకు పలు సంఘాల మద్దతు

ప్రజాశక్తి-భోగాపురం

ముంజేరు దళిత కాలనీని జిల్లా ఎస్పి, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు సందర్శించి దళితుల సమస్యలు తెలుసుకోవాలని, దళితులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ చింతపల్లి దుర్గారావు, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగేటి సంతోష్ డిమాండ్ చేశారు. సోమవారం భోగాపురంలో 24వ రోజు నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దత్తు తెలిపారు. పోలీసు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లనే దళితులు పెత్తందార్ల దాడికి గురికావాల్సి వచ్చిందని అన్నారు. ముంజేరు గ్రామంలో మొత్తం వీధి కాలువలను దళిత కాలనీకి మళ్లిస్తూ కాలువ నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో దళితులు దానికి అభ్యంతరం తెలిపి భోగాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పోలీసు అధికారులు పెత్తందార్లపై ఏ రకమైన చర్యలూ తీసుకోకపోవడం వల్ల దానిని అదునుగా తీసుకొని దళితులపై దాడి చేసి వారి అంగీకారం లేకుండా కాలువలు నిర్మించారని అన్నారు. ఈ సంఘటన జరిగిన తరువాత దళితులు, దళిత సంఘాలు ఆందోళన చేస్తే తరువాత అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందితులను స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారని, ఇది సమంజసం కాదని అన్నారు. ఇంత జరిగినా నెల్లిమర్ల ఎమ్మెల్యే నివాసానికి అతి సమీపంలో జరిగినా కనీసం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని , జిల్లా అధికారులు దళిత పేటలో పర్యటించి వారి తో చర్చించి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

దీక్షలో కూర్చున్న ప్రజాసంఘాల నాయకులు ఆనంద్, దుర్గారావు తదితరులు